మహానాడు స్థల భూమి పూజ వాయిదా

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28 తేదీల్లో మహానాడు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఇందుకు బుధవారం నిర్వహించాల్సిన భూమి పూజ వాయిదా వేసినట్లు టీడీపీ నేత పరుచూరి అశోక్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. గురువారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అంత్యక్రియలకు హాజరుకావాల్సి ఉన్నందున భూమి పూజ వాయిదా వేశారు. త్వరలో తదుపరి తేదీ తెలియజేస్తామని వివరించారు.

రాయచోటి పెద్దాయన..

ఇకలేరు...



- సుగవాసి పాలకొండ్రాయుడు కన్నుమూత
- ఒకసారి ఎంపీ.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు
- 40 ఏళ్లుగా టీడీపీలోనే..
- సీఎం చంద్రబాబు సహా పలువురి సంతాపం
- అంతిమ చూపు కోసం తరలివచ్చిన జనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పెద్దాయన ఇకలేరు. పార్టీలకతీతంగా అందరూ పెద్దాయనగా పిలిచే సుగవాసి పాలకొండ్రాయుడు (79) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా ఒకసారి, రాయచోటి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన ఆయన రాజంపేట పార్లమెంటు, రాయచోటి నియోజకవర్గాలలో చెరగని ముద్ర వేశారు. బలిజ సామాజికవర్గానికి చెందిన ఈయనకు రాయలసీమలో మంచి పేరుంది. చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలతో పాటు తొలిసారిగా 1978లో ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. గురువారం ఉదయం 9 గంటలకు రాయచోటి పట్టణంలో ఆయన సొంత సినిమా థియేటర్ల సమీపంలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన పార్థివదేహం కడసారి చూపు కోసం రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

కుటుంబ నేపథ్యం

రాయచోటి మున్సిపాలిటీ మాసాపేటకు చెందిన వెంకటస్వామి, కాంతమ్మ దంపతులకు 1946 జూలై 30వ తేదీ పాలకొండ్రాయుడు జన్మించారు. ఐదుగురు మగసంతానంలో మూడవ వాడైన ఈయనకు ఇద్దరు అక్కలు ఉన్నారు. భార్య శమంతకమణి చాలా సంవత్సరాల కిందట మరణించారు. ఈయనకు ఇద్దరు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబు, కుమార్తె రేవతి ఉన్నారు. ఈయన పదో తరగతి వరకు చదువుకున్నారు.

రాజకీయ నేపథ్యం

తొలినాళ్లలో పాలకొండ్రాయుడు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో కామ్రేడ్ పిచ్చిరాజు శిష్యుడిగా పనిచేశారు. తర్వాత 1978లో తొలిసారిగా జనతా పార్టీ తరపున రాయచోటి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 1983లో రాయచోటి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్టీ రామారావు ఆహ్వానంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1984లో రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1990లో ఎమ్మెల్యే అభ్యర్థిగా, 1992లో రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా, అదే సంవత్సరం జరిగిన రాయచోటి అసెంబ్లీ ఉప ఎన్నిక, 1994 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటమి చెందారు. తర్వాత 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. 2004లో రాష్ట్రమంతటా కాంగ్రెస్ హవా జోరుగా నడిచిన సమయంలోనూ ఆయన గెలుపొందడం విశేషం. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో 2009లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు. 2012 ఉప ఎన్నికల్లో ఆయన పెద్ద కొడుకు బాలసుబ్రమణ్యం పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత ఈయన కుటుంబానికి 2014, 2019లో పోటీ చేసే అవకాశం రాలేదు. 2024లో రాజంపేట అసెంబ్లీ స్థానానికి ఆయన పెద్దకుమారుడు బాలసుబ్రమణ్యం పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన చిన్న కుమారుడు ప్రసాద్‌బాబు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడిగా పని చేశారు. ప్రస్తుతం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. పాలకొండ్రాయుడు 8 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి నాలుగుసార్లు గెలిచారు. రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి ఒకసారి గెలిచారు. 40 సంవత్సరాలుగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా టీడీపీలోనే కొనసాగుతున్నారు.



సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను ఓదారుస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



ఎన్టీ రామారావుతో ఎన్నికల ప్రచారంలో పాలకొండ్రాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో... (ఫైల్)

పెద్దాయనగా.. జనంలో పట్టు

నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో పాలకొండ్రాయుడుకు నియోజకవర్గంలో పెద్దాయనగా జనంలో పట్టుంది. పార్టీలకతీతంగా ఈయనను పెద్దాయనగా పిలుచుకుంటారు. నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాల ప్రజల నాయకుడిగా పేరుంది. జనతా పార్టీ, తెలుగుదేశంలలో ఉంటున్నా.. తొలినాళ్లలో పనిచేసిన కమ్యూనిస్టు భావజాలం ఉండటంతో ఈయనకు సామాన్య జనంలో గట్టి పట్టు ఏర్పడిందని చెప్పవచ్చు.

రాయచోటి ఘటనలతో అనేక సంస్కరణలు

1985 నుంచి 2004 వరకు రాయచోటిలో ఎన్నికలంటే ఒక యుద్ధంలాగే జరిగేవని స్థానికులు పేర్కొంటుంటారు. పాలకొండ్రాయుడుకు వ్యతిరేకంగా స్వయంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జనరల్ ఏజెంటుగా ఇక్కడ వ్యవహరించేవారు. ఈయన తరపున జనరల్ ఏజెంటుగా చంద్రబాబునాయుడు ఉండేవారు. 1990లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి హత్యకు గురయ్యారు. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ సంఘటనతో ఏదైనా గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థి మరణిస్తేనే ఎన్నికలు వాయిదా వేసే విధంగా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా 1992లో ఎన్నికల్లో జరిగిన హింసలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు చనిపోయారు. దీంతో ఆ సంఘటనతో ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది చనిపోతే నష్టపరిహారం ఇచ్చే విధంగా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఇటువంటి ఎన్నో సంఘటనల నేపథ్యంలో రాయచోటి నియోజకవర్గం పేరు రాష్ట్ర, దేశ స్థాయిలో మార్మోగేది. అయితే 2009 ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయంగా క్రియాశీలంగా వ్యవహరించలేకపోయారు. కొడుకులు ఇద్దరూ క్రియాశీలకంగా ఉండేవాళ్లు.

పలువురితో సన్నిహిత సంబంధాలు

పాలకొండ్రాయుడుకు మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. అదేవిధంగా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనూ చాలా సన్నిహిత సంబంధాలు ఉండేవి. జనంలో ఇతనికి ఉన్న పట్టును చూసి స్వయంగా ఎన్టీ రామారావు పిలిచి ఎంపీ టికెట్టును ఇచ్చారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్ వంటి పలువురు ప్రముఖులు, నాటి కేంద్రంలోని పలువురు మంత్రులతోనూ మంచి సంబంధాలు ఉండేవి.



పాలకొండ్రాయుడు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



ప్రసాద్‌బాబును ఓదారుస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్

పలువురి సంతాపం

పాలకొండ్రాయుడు మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తమ సంతాపం తెలిపారు. పాలకొండ్రాయుడు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పాలకొండ్రాయుడు కొడుకులకు ముఖ్యమంత్రి ఫోన్ చేసి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ తరపున రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తదితరులు బుధవారం రాయచోటికి వచ్చి పాలకొండ్రాయుడుకు నివాళులర్పించనున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాత్రి పాలకొండ్రాయుడు పార్థివదేహాన్ని సందర్శించి ఆయన కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను కలిసి సంతాపం తెలిపారు. రాయచోటి నియోజకవర్గ చరిత్రలో పాలకొండ్రాయుడు తనదైన ముద్ర వేసుకున్నారని ఆయన అన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, మంత్రి మండిపల్లి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్యతో పాటు పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపం తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజులు ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలకతీతంగా పలువురు నాయకులు, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో సీఐడీ అధికారులు



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెళుతున్న సీఐడీ అధికారులు

మదనపల్లె టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం కేసు విషయమై తిరుపతి సీఐడీ అధికారులు మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. మంగళవారం సీఐడీ డీఎస్పీ పద్మలత ఆధ్వర్యంలో అధికారులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ తహసీల్దార్ ధనంజయులు క్యాంపులో ఉండగా, డీటీ సెలవులో ఉండటంతో అందుబాటులో ఉన్న ఆర్ఐ భరత్‌రెడ్డితో పలు విషయాలు మాట్లాడారు. ముఖ్యంగా మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో 22-ఏ భూముల క్రమబద్ధీకరణ కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వివరాలు ఇవ్వాలని కోరారు. ఇదివరకే జనవరి నెలలో సీఐడీ అధికారులు పై తెలిపిన వివరాలు నివేదికలు పంపాలని కోరగా, ఇంత వరకు వారికి సమాధానం పంపలేదు. దీంతో స్వయంగా సీఐడీ డీఎస్పీనే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఈ నివేదికలు పంపాలని ఆర్ఐ ద్వారా తహసీల్దార్‌ను కోరినట్లు సమాచారం.

జిల్లాకు చేరిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు



డిక్షనరీల స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు పంపిణీ చేయడానికి 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు చేరాయి. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం డిక్షనరీల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లం మీద పట్టు సాధించడానికి విద్యార్థి స్వతహాగా ఆంగ్ల పదాల అర్థాలు తెలుసుకోవడానికి జిల్లాలోని 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తామని, తెలుగు డిక్షనరీలు కాకుండా ఈసారి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆంగ్లం ఉర్దూ డిక్షనరీలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 653 ఉర్దూ డిక్షనరీలు, పీఎంశ్రీ పాఠశాలల్లో చదివే వారి కోసం 2705 డిక్షనరీలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి కోసం 8189 డిక్షనరీలు జిల్లాకు చేరాయని, వీటిని 6వ తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్యానుగుణంగా మండలాలకు పంపుతామని తెలిపారు. స్టాక్ పాయింట్ సందర్శనలో ఆయన వెంట జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) కరుణాకర్, ఆక్స్‌ఫర్డ్ ప్రాంతీయ మేనేజర్ వెంకటపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- నష్టపరిహారంతో పాటు ఉద్యోగం, భూమి ఇప్పించేందుకు కృషి
- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సోలార్ రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

గాలివీడు, మే 6 (ఆంధ్రజ్యోతి): తూముకుంట సోలార్ పవర్ ప్లాంట్ నిర్వాసితులకు సముచిత న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభాభవనంలో ఆర్డీవో శ్రీనివాసులతో కలిసి తూముకుంట రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 100 మెగావాట్ల అదనపు సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. అంతేగాక భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూమి ఇప్పించేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పచ్చటి వ్యవసాయ భూములను తీసుకుంటున్న ప్రభుత్వం ఆ మేరకు ఎకరాకు రూ.6 లక్షలు చెల్లించాలని రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వ గణన ప్రకారం ఎకరాకు రూ.3.30 లక్షలు మాత్రమే ఇస్తామని, రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎకరాకు రూ.3.60 లక్షలకు పెంచి ఇప్పించేందుకు కృషి చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. అంతేగాక హెచ్‌పీసీఎల్ లాంటి సంస్థలు వస్తే గ్రామాల్లో ఉన్న యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు. అంతకు మునుపు జేసీ తూముకుంట ప్రకాశ్‌నగర్ కాలనీలో సోలార్ ప్లాంట్‌ను రైతులతో కలిసి సందర్శించారు. అనంతరం వెలిగల్లు పార్కులో మరుగుదొడ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సోలార్ డీఈ శివశంకర్‌నాయుడు, తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బలాజీ, రైతులు పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం...!

- రవీంద్రుడు నడయాడిన నేల..
- పుష్కరకాలంగా అసంపూర్తి నిర్మాణం
- ఎస్‌డీఎఫ్ నిధులు పెండింగ్ పనులు

6



ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

- 810 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
- నలుగురి అరెస్టు

6

మదనపల్లి డివిజన్‌లో 8 బ్లాక్ స్పాట్స్

● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఎనిమిది ప్రాంతాలను రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలుగా గుర్తించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళ వారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముదివేడు పోలీసు స్టేసన్ పరిధిలో ఒకటి, తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు, బి.కొత్తకోట పరిధిలో ఒకటి, మదనపల్లె వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు చోట్ల ఉన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతాల్లో సైడ్ బోర్డులు, సీసీ కెమెరాలు, రేడియం స్టికర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో విద్యార్థులు, పిల్లలు ఈతకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈతకు కావాల్సిన సామగ్రి తోనే చెరువు, బావుల్లో పెద్దల సమక్షంలో ఈత ఆడాలన్నారు. చెరువులు, బావులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వేసవి సెలవుల్లో ఊళ్లకు, వెళ్లే వారు విలువైన వస్తువులు తమ బంధువులకు అప్పగించి వెళ్లాలని సూచించారు. సమీపంలోని పోలీసులకు విషయం తెలిపితే ఎన్‌హెచ్ఎంఎస్ ఏర్పాటు, పోలీస్ బీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే శక్తి యాప్ ద్వారా మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతి



మహదేవ (ఫైల్)

కలికిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న పలపందల మహదేవ (39) ట్రాక్టర్ ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. సోమవారం ఉదయం ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్యం పని ముగించి చెత్తను వేసేందుకు ట్రాక్టర్‌ను ఎక్కే క్రమంలో పట్టుజారి కింద పడిపోయాడు. రోడ్డుపై వెల్లకిలా పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తిరుపతి ప్రభుత్వ రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానిక వెంకటేశ్వరపురానికి చెందిన మహదేవ గత దశాబ్దకాలంగా పంచాయతీలో పారిశుధ్య కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. మృతుడు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...



శ్రీనివాసరాజు

రాజంపేటటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ సమీపంలో మంగళవారం కారు - బైకు ఢీకొన్న సంఘటనలో చంద్రరాజు శ్రీనివాసరాజు(46) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... శ్రీనివాసరాజు ఊటుకూరులోని తన ఇంటిలో చిన్నషాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ద్విచక్రవాహనంపై రాజంపేటకు వెళ్లి అంగడి సరుకులు తీసుకుని ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో కడప నుంచి చెన్నైకి వెళుతున్న కారు అతి వేగంతో వచ్చి బైకు ఢీకొనడంతో శ్రీనివాసరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గుర్తించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని భవన నిర్మాణ కార్మికుడు...



చలపతి (ఫైల్)

మదనపల్లెఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో భవన నిర్మాణ కార్మికుడు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. తాలుకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం, కాట్లాటపల్లె రోడ్డు నీరుగట్టువారిపల్లెకు చెందిన చలపతి (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఉరివేసుకుని మృతి చెందాడు. తాలుకా పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పటిష్ఠమైన భద్రతా చర్యలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా భారత హోం మంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, డిఫెన్స్ రూల్స్ 1968 లోని సెక్షన్ 19 కింద హోం వ్యవహారాల మంత్రిత్వ భారత ప్రభుత్వం నిర్దేశించిన జిల్లాలోని పౌరరక్షణ మాక్ డ్రిల్, రిహార్సల్ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భూభాగాల్లో పౌరరక్షణ యంత్రాంగాల సంసిద్ధతను అంచనా వేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రణాళిక ప్రకారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వలంటీర్లు, హోంగార్డులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకేలు, కళాశాల, పాఠశాల విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణతో దేశం చేపట్టే పౌరరక్షణ, చర్యల కార్యాచరణ, సమర్థత, సమన్వయాన్ని అంచనా వేస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గురుపూజ మహోత్సవాలు



నరనంది ఉత్సవంలో బ్రహ్మంగారు, గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 6 (ఆంధ్రజ్యోతి): వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మంగళవారం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబలు గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరబ్రహ్మంగారి ఆరాధన, నిత్యాన్నదాన సేవాసంఘం విజయవాడ గురుస్వాములు చేపట్టారు. మధ్యాహ్నం దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, అన్నదానం దేవస్థానం వారు చేప ట్టారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల చేత భరతనాట్యం, కోలాటం సాంస్కృతిక భక్తిగీతాలు, భజనలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు బ్రహ్మంగారి సమేత నరనంది ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు పాపయ్యగారి కుమార్తె వెంకటమ్మ, రామాపురం, బద్వేలు వాస్తవ్యులు నరనంది ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం హరికథా కాలక్షేపం చేపట్టారు.

ఎందుకింత నిర్లక్ష్యం...!



మదనపల్లె బీటీ కళాశాలలో అర్ధంతరంగా ఆగిన రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజి



- రవీంద్రుడు నడయాడిన నేల..
- పుష్కరకాలంగా అసంపూర్తి నిర్మాణం
- ఎస్‌డీఎఫ్ నిధులు పెండింగ్
- సీఎం హోదాలో కిరణ్‌కుమార్‌రెడ్డి వరం
- నేటి కూటమి నేతలతోనైనా పూర్తయ్యేనా?

మదనపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): రవీంద్రుడు నడయాడిన నేల అది. జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించిన ప్రాంతం. బ్రిటీష్ వనిత డాక్టర్ అనీబిసెంట్ స్థాపించిన విద్యాలయం. రాయలసీమలోనే మొదటి డిగ్రీ కళాశాల. అందులో ప్రముఖులు విద్యనభ్యసించి రాజకీయంగా, ఉద్యోగ పరంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్న బీటీ కళాశాల అది. అలాంటి ప్రముఖ కళాశాలకు అనుబంధంగా నిర్మించ తలపెట్టిన రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీ, ఆడిటోరియం, మెడిటేషన్ హాలు, ఆస్తుల పరిరక్షణకు ఉద్దేశించి ప్రహరీ నిర్మాణ పనులు పుష్కరకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. అవి వినియోగంలోకి రాకనే పిచ్చిమొక్కల మధ్య నిర్మాణాలు వెక్కిరిస్తూ, శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నేటి కూటమి ప్రభుత్వంలోనైనా పనుల్లో వేగం పెంచాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

అప్పట్లో బీటీ కళాశాల అభివృద్ధి పనులకు అడుగు లేసిన నాటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పట్లో అభివృద్ధి పనులకు నిధులు సాధించిన అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాలు ఇద్దరూ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అప్పట్లో నిధులు సాధించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సీఎం హోదాలో నిధులు మంజూరు చేసిన కిరణ్‌కుమార్ రెడ్డిలు పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

బీటీ కళాశాల అభివృద్ధికి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సీఎం హోదాలో 2012-14 మధ్య కాలంలో స్పెషల్ డెవలప్‌మెంట్ (ఎస్‌డీఫ్) పథకం కింద నిధులు మంజూరు చేశారు. జాతీయగీతం ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇక్కడి కళాశాలలో 2012 జనవరి 24న జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం హోదాలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేస్తూ వరాలజల్లు కురిపించారు. ఇందులో రవీంద్రనాథ్‌ఠాగూర్ కాటేజీ, మ్యూజియం, ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో ప్రహరిగోడ మినహా మిగిలిన పనులన్నీ మొదలై అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇందులో రూ.2.86 కోట్లు విలువ చేసే పనులు పూర్తి కాగా, మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆడిటోరియం, కాటేజీ పనులు స్లాబ్ వరకు పూర్తి కాగా, మెడిటేషన్ పనులు పిల్లర్ల దశలో ఆగిపోయాయి. అప్పట్లో ఈ ఉత్సవాలను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న, ఇప్పటి టీడీపీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నిర్వహించగా, సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని పట్టుపట్టి మదనపల్లెకు రప్పించారు. ఆయన చేత బీటీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు ప్రారంభమయ్యాయి. తర్వాత 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రారంభమైన పనులన్నీ ఆగిపోయాయి. తిరిగి నేటి కూటమి ప్రభుత్వంలో ఆ పనులు పూర్తి చేయాలని స్థానికులతో పాటు బీటీ కళాశాల పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. మరోవైపు వారిద్దరూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులు కావడంతో పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన ఈ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో మెడిటేషన్ హాలు నిర్మాణం పిల్లర్ల దశలో పిచ్చిమొక్కలు, కంప చెట్ల మధ్య నిండుకుపోయింది. అలాగే ఆడిటోరియం వినియోగంలోకి రాక, మద్యంప్రియులకు షెల్టర్‌గా, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.

జిల్లా వ్యాప్తంగా రూ.5.50 కోట్లతో 225 పనులు

పంచాయతీరాజ్ పరిధిలో రూ.3 కోట్లతో 53 పనులు, రోడ్లు, భవనాల శాఖ రూ.కోటి, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో రూ.2 కోట్లు పనులు మంజూరు చేశారు. అప్పటి సీఎం సొంత నియోజకవర్గం పీలేరుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వగా, ఇందులో కలకడ, వాల్మీకిపురంలో జూనియర్ కళాశాల భవనాలు, కలికిరిలో నాక్ భవనం మంజూరు చేశారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి బోర్లు, పైపులైన్లు, పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు, రోడ్లు, భవనాల శాఖాధికారులు జూనియర్ కళాశాల భవనాలు, కలికిరిలో నాక్ భవనాలు, సాంఘిక సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు మదనపల్లెలోని బీటీ కళాశాలలో ఆడిటోరియం, రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీ, మెడిటేషన్ హాలు, కళాశాల ఆస్తుల పరిరక్షణకు ప్రహరీగోడ, సబ్‌కలెక్టర్ కార్యాలయం భవనాలు, తదితర పనులు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మంజూరైన పనుల్లో సగానికి పైగా పూర్తికాగా బిల్లులు చెల్లించేశారు. తర్వాత 2014లో అసెంబ్లీ ఎన్నికలు రావడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లుల చెల్లింపులకు బ్రేక్ పడింది. ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో అప్పటికే కాంట్రాక్టర్లకు జారీ చేసిన చెక్కులు చెల్లలేదు. దీంతో కొంతమంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. పనులపై క్షేత్రస్థాయిలో కమిటీ నివేదిక ఆధారంగా బిల్లులు చెల్లించారు. మిగిలిన పనులన్నీ అప్పటి నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్నాయి.



బీటీ కళాశాల మైదానంలో పిల్లర్లకే పరిమితమైన మెడిటేషన్ హాలు

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

● 810 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
● నలుగురి అరెస్టు



వై.కోట అడవుల్లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

రైల్వేకోడూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖాధికారులు మంగళవారం కోడూరు మండలం కె.బుడుగుంటపల్లె, ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామాలలో మెరుపుదాడులు చేసి 810 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కోడూరులో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఓబులవారిపల్లె పోలీసుల ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడి దాడులు చేశామన్నారు. కె.బుడుగుంటపల్లె గ్రామంలో 210 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నాగేశ్వర్ రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి దగ్గర నుంచి 260 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వై.కోట గ్రామంలోని సిద్ధులయ్యగుట్ట, పాలకూరవంక దగ్గర దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కోనేటి మణి, సుబ్రహ్మణ్యంలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే ఈనెల 2న బుడుగుంటపల్లెలో కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తన సిబ్బందితో దాడులు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన ప్రశాంత్, నందా, నాగయ్య, పెంచలమ్మ దాడికి పాల్పడినట్లు తెలిపారు. వీరికి సహకరించిన మరో 8 మంది స్థానికులను గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. దాడికి ప్రయత్నించిన వారిపై ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి రవి, సీఐ జహీర్, కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి, రాజంపేట సీఐ మల్లిక, టాస్క్‌ఫోర్సు సీఐ ఎల్లయ్య, ఎస్ఐ హేమకుమార్, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి/ ముగ్గురు అరెస్టు



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పులివెందులటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారా స్థావరాలపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. 'పులివెందులలో నాటు..ఘాటు' యధేచ్ఛగా నాటుసారా తయారీ.. అన్న కథనం మంగళ వారం ప్రచురితమైంది. ఇందుకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మంగళవారం స్టేషను పరిధిలోని ఉలిమెల్ల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ ప్రాంతాలపై దాడులు చేశారు. సారా తయారీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశారు. అంతే కాకుండా 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలైన నగరిగుట్టకు చెందిన కె.శివశంకర్, నీలకంటేశ్వర, కుల్లాయప్పలను అరెస్టు చేసి రిమాండు నిమిత్తం పులివెందుల సబ్‌జైలుకు పంపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారాను నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకుంటూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరిగుట్ట, రామిరెడ్డిపల్లె, అంబకపల్లె, కల్లూరిపల్లి తాండా, కుప్పతాండాలలో నవోదయం 2.0లో భాగంగా సారాను పూర్తిగా నిర్మూలించడం జరుగుతుందన్నారు. ప్రజలు, నాయకులు, పాత్రికేయులు, ప్రజాసంఘాల వారు నవోదయం 2.0లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టరు ఎస్ఐ రామప్రసాద్, సిబ్బంది మల్లిఖార్జునప్రసాద్, జగదీశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

● అరటి, తమలపాకు, మామిడి రైతులకు నష్టం
● ఇంట్లో పిడుగుపాటు - తప్పిన ప్రమాదం



చిన్నఓరంపాడు - ఓబులవారిపల్లె మధ్యలో విరిగిన విద్యుత్ స్తంభం

ఓబులవారిపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన గాలివానకు అపార నష్టం వాటిల్లింది. ఓబులవారిపల్లె పంచాయతీకి చెందిన ఓబిలి శ్రీనివాసులరెడ్డి ఇంటిలో పిడుగు పడడంతో ఇంటిలోని ఫ్రిజ్, బీరువాలు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అదేవిధంగా ఓబులవారిపల్లె, చిన్నఓరంపాడు క్రాస్ మధ్యలో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. భారీ గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్‌లైన్లు తెగిపోయి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వందలాది ఎకరాలు అరటికి నష్టం వాటిల్లింది. చిన్న ఓరంపాడు, గాదెల, వై.కోట, బాలిరెడ్డిపల్లె, చెన్నరాజుపోడు గ్రామాల్లో తమలపాకు, అరటి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు...

మదనపల్లెఅర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై యువకుడు చిత్తూరు జిల్లాలోని పట్టణంలో పురుగుల మందుతాగి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు.. మదనపల్లె పట్టణం కురవంకకు చెందిన వీరవెంకట నాగరాఘవేంద్ర వ్యాస కుమార్ (42), తన భార్య చిత్తూరులో నర్సుగా పని చేస్తుండడంతో అక్కడే ఉండేవాడు. కుటుంబ కలహాలతో చిత్తూరుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఈ నెల 1న ఆత్మహత్యకు యత్నించాడు. వేలూరులో చికిత్స పొందుతుండేవాడు. పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి మదనపల్లెలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని శవపరీక్షల గదికి తరలించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం...

● ఆక్రమణదారులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, మే 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివార్లలోని వినాయక చేనేతనగర్‌లో విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నించిన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 633-11లో 0.15 సెంట్ల ప్రభుత్వ డీకేటీ భూమి ఉంది. అయితే ఈ భూమిని మదనపల్లె పట్టణానికి చెందిన కొంతమంది ఎక్స్‌కవేటర్‌తో కొంత స్థలాన్ని చదును చేశారు. దీనిపై చుట్టు పక్కల వారు ప్రశ్నించగా తమకు పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి ఆ భూమికి సంబంధించిన రికార్డులు తమకు చూపించాలని కోరారు. దీంతో వారు ఇంటి వద్ద ఉన్నాయని కార్యాలయానికి తెచ్చి చూపిస్తామన్నారు. ఈ విషయమై తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యంలు మాట్లాడుతూ ఈ భూమిలో బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలో ఆక్రమణకు గురైన స్థలాలకు సంబంధించి తమకు దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా మండల పరిధిలో నిత్యం భూ వివాదాలు జరుగుతుండంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.



భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

బండరాళ్లతో కొట్టి హత్యాయత్నం



బండరాళ్లతో బాదడంతో తీవ్రంగా గాయపడిన బాలాజి

నిమ్మనపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని రాత్రి సమయంలో బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం మండలంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలంలోని బండ్లపై పంచాయతీకి చెందిన ఉషకు 15 ఏళ్ల క్రితం రాయచోటి మండలం అబ్బవరం పంచాయతీ ఇందుకూరుకు చెందిన బాలాజితో వివాహమైంది. వీరికి ఒక కూమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అయితే కొన్నేళ్లుగా బాలాజి తన కుటంబంతో కలిసి రాయచోటిలో వుంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. గత మూడు నెలలుగా భార్య భర్తల మధ్య కుటంబ కలహాలు రావడంతో ఉష తన పుట్టినిల్లు అయిన బండ్లపై వచ్చి ఇక్కడే వుండేది. కాగా తన భార్య కాపురానికి రాకపోవడంతో 15 రోజుల క్రితం బాలాజి కూడా బండ్లపై వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యభర్తలు ఇద్దరూ కలసి బహిర్భూమికి బయటకు వెళ్లారు. ఇదే అదునుగా చేసుకొని కొందరు దుండగులు ముసుగు ధరించి బండరాళ్లతో బాలాజి తలపై బలంగా మోదారు. దీంతో తలకు తీవ్రగాయాలు కాగా స్పృహతప్పి పడిపోయాడు. రక్తపు మడుగులో వున్న బాలాజిని మదనపల్లికు తరలించగా అక్కడ వైద్యులు తిరు పతి రుయాకు రెఫర్ చేశారు. కాగా భార్య ఉషా మరోక వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పరచుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. దీనిపై బాలాజి తల్లి రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

కడప ఎడ్యుకేషన్, మే 6 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సీడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని గ్రామీణ నిరుద్యోగ యువ తకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించ నున్న ట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజా సింగ్ తెలిపారు. మంగళవారం కడప నగరం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ డీడీయు-జీకేవై పథకం ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవ లపర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్, బ్యూటీ థెరపీ కోర్సులలో నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, కంప్యూటర్ నైపుణ్యా లు, స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్ శిక్షణ కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్‌తో పాటు అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలి పారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలని. అర్హతకు అనుగుణంగా కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పుష్పగిరిలో హుండీ లెక్కింపు.. రూ.7,59,762 ఆదాయం



హుండీ లెక్కింపు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

వల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి క్షేత్రం లక్ష్మీ చెన్న కేశవస్వామి దేవస్థానంలో హుండీలను లెక్కించగా రూ.7,59,762 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివా సులు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 25 నుంచి మే 4వ తేదీ వరకు సేవా టికెట్ల ద్వారా రూ.69,750, అన్న దానం కోసం భక్తులు ఇచ్చిన చందాలు 78,285, శాశ్వత హుండీ ద్వారా రూ.6,11,462 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మొత్తం డబ్బును దేవ స్థానం బ్యాంకులో జమ చేస్తామన్నారు. జిల్లా దేవదా యశాఖ కమిషనరు జి.మల్లికార్జున, శాశ్వత దేవస్థానచైర్మన్ బి.వెంకట సుబ్బారెడ్డి, పురావస్తుశాఖ, దేవదాయశాఖ సిబ్బం ది, అర్చకులు, పూజార్లు భక్తులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

సింహాద్రిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోమ డ గ్రామంలో ఉన్న 79 ఎకరాల 42 సెంటల్లో ఉన్న అగ్రి గోల్డ్ భూములను తిరుపతి సీఐడీ శాఖ సీఐ రారాజు సింహాద్రిపురం తహసీల్దార్ నాగేశ్వరరావుతో కలసి మంగళ వారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యా క అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారంపై ఇచ్చిన హామీలో భాగంగా ఆ సంస్థకు సంబంధించిన ఆస్తుల వివరాలు ఆయా శాఖల అధికారుల ద్వారా సేకరిస్తున్నారు. ఇందులో భాగంగానే లోమడ గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయా ? లేక ఆక్రమణలో ఉన్నాయా అనే వివరాలపై సీఐడీ అధికారులు ఆరా తీసి సరిహద్దులను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. అగ్రిగోల్డ్‌కు సంబంధిం చిన భూముల ద్వారా వచ్చే సొమ్ముతో బాధితులకు సాయం అందించనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజగోపాల్, పుష్పరాజ్, సీనియర్ అసిస్టెంట్ సింగరయ్యలు పాల్గొన్నారు.

పులివెందుల ఆర్‌డీవోగా చిన్నయ్య

కడప కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారిగా జి.చిన్న య్యను నియమిస్తూ ప్రభు త్వం మంగ ళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తు తం ముద్దనూరు గాలేరు నగరి సుజల స్రవంతి యూనిట్-3 భూ సేకరణ విభా గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచే స్తున్న చిన్నయ్యను పులివెందుల ఆర్డీవోగా బదిలీ చేశారు. పులివెందుల ఆర్డీవో జి.భానుశ్రీ ప్రస్తుతం సెలవులో వున్నారు. ఈమేరకు ప్రభుత్వ సాధారణ పరిపాల నాశాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

పంటల ధరలను రైతులే నిర్ణయించాలి

చెన్నూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు పండిస్తే వాటి ధరను రైతులే నిర్ణయించేలా అవగాహన కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ దక్షిణ భారత సంఘటనా అధ్యక్షు డు డి.రాము అన్నారు. చెన్నూరు ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం రెండో రోజు బీకేఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ నేటికీ రైతులు పండించిన ధరలను దళారులు, ప్రభుత్వాలు నిర్ణయిస్తు న్నాయన్నారు. అలా కాకుండా మన పంటకు మనమే ధర లు నిర్ణయించుకోవాల్సిన దిశగా రైతులు ఎదగాలన్నారు. గో ఆధారిత వ్యవసాయం, వాణిజ్యం కూడా రైతులే చేయా లనే నినాదం దిశగా ముందడుగులు వేయాలన్నారు. బీకేఎ స్ పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సహ దేవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జనార్ధనరెడ్డి, ఆదర్శ రైతు బాల చంద్ర, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వంలో 50 ఏళ్లు అభివృద్ధి వెనక్కి'

బ్రహ్మంగారిమఠం, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత జగన్ పరి పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందని. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నా రు. మంగళవారం ఆయన వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శిం చుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రెండు పార్టీలు ప్రజ లకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం నెరవేర్చలేదని అన్నా రు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఏ ఒక్క పథకం ప్రజలకు అందించడంలో విఫల మైందన్నారు. రాబోవు రోజుల్లో రెండు ప్రభుత్వాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 2029 ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థులను అంధకారంలోకి నెట్టిన జగన్

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, మే 6 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్కి టెక్చర్ విద్యార్థులను నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంధకారంలోకి నెట్టారని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాకు వీడియో పంపారు. అందు లో ఆయన మాట్లాడుతూ 2020లో డాక్టర్ వైఎ స్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఏదైనా యూని వర్సిటీని నెలకొల్పాలంటే అందుకు అనుమతులు తప్పకుండా తీసుకో వాల్సి ఉంటుందన్నారు. వారు పరిశీలించిన తర్వాత అన్ని సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉంటే అనుమతులు ఇవ్వడం జరుగుతుం దన్నారు. 2023-24 వరకు కూడా అనుమతులు లేకుండా నడిపార న్నారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా, ముందుచూపు లేకుండా కేవలం తన తండ్రి పేరు ఉండాలనే ఆలోచ నతో యూనివర్సిటీని కడపలో నెలకొల్పారని ఆరోపించారు. 2020లో అప్పట్లో 64 మంది విద్యార్థు లు కళాశాలలో చేరారన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి వారి కోర్సు పూర్తవుతుదన్నారు. వారికిచ్చే సర్టిఫికెట్ ఈ దేశంలో ఎక్కడేగాని చెల్లని పరిస్థితి ఉందన్నారు. ఆయనకు సం బంధించిన బంధువులకు రిజిస్ట్రార్ పోస్టులు, వారి అనుచరులకు ఉద్యోగాలు ఇవ్వాలనే దురాలోచన చేసి విద్యార్థులను అంధకారంలోకి నెట్టిన ఘనత మాజీ సీఎం జగన్‌దే అన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని సరిదిద్దా లని ప్రయ త్నించారని, అయితే అది సాధ్యం కాలేదని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన వీసీ అనేక ఆపసోపాలు పడ్డ తర్వాత 2022- 23, 2023-24కు సంబంధించి అనుమతులు వచ్చాయన్నారు. అయితే మొదటి బ్యాచ్‌లో చేరిన విద్యార్థులు మా భవిష్యత్ ఏంటని ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసు కెళ్లగా వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ ఆర్ఎం



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): బుద్ధ పూర్ణిమ సందర్భాన్ని పురష్కరించుకుని ఈ నెల 12న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై (అరు ణాచలం)కు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి 8 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఆమేరకు మంగళవారం స్థాని క ఆర్టీసీ ఆర్ఎం కార్యాల యంలోని ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని కడప, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, డిపోల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా అరుణాచలానికి ప్రయాణికులు, భక్తులు సురక్షితంగా చేరుకుని స్వామివారిని దర్శించు కోవాలని కోరారు.

బస్సుల వివరాలిలా... : కడప డిపో నుంచి ఈ నెల 11న ఆదివారం ఉదయం 6 గంటలకు ఒక బస్సు, రాత్రి 9 గంటలకు ఒకటి, బద్వేల్ డిపో నుంచి అదేరోజు ఉదయం 9 గంటలకు, మైదుకూరు డిపో నుంచి మధ్యా హ్నాం 3 గంటలకు, అదేవిధంగా ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు, జమ్మ లమడుగు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు, అదేరోజు రాత్రి 8 గంటలకు బస్సు సౌకర్యం ఉందన్నారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలకూ..: మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన, రథోత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మంగారిమఠానికి 76 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులు బుధవారం నుంచి బి.మఠానికి చేరుకోనున్నాయన్నారు. ఆ మేరకు మైదుకూరు డిపో నుంచి 54 బస్సులు, బద్వేల్ డిపో నుంచి 22 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి సోమవారం పొలతలకు..: పొలతల మల్లేశ్వరస్వామిని దర్శించు కునే భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం కడప, డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. కడప నుంచి ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు, తిరుగు ప్రయాణంలో పొలతల నుంచి కడపకు ఉదయం 11కు, మధ్యాహ్నం 3 గంటలకు బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

పరిశోధన ఫలితాలను త్వరితగతిన వెల్లడించాలి



మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు సత్యనారాయణ

సీకేదిన్నె, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పరిశోధన ఫలితాలను త్వరిత గతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించడమేకాక ప్ర భుత్వానికి సబ్సిడీ కూడా తగ్గుతుందని ఆచార్య ఎన్జీరంగ పరిశోధన సం చాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. దక్షిణ మండల వ్యవ సాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం రెండవ రోజు మంగళవారం శాస్త్రవేత్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ సమర్ధతస్థాయి ని పరిశీలించాలని, పరిశోధన ఫలితాలు త్వరగా అందించడం వలన భూమి, నీరు, వాయుకాలుష్యాన్ని కూడా తగ్గించి పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. పురుగు మందుల అవశేషాలను, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లలో త్వరగా నిర్ధారించే పద్ధతులను గుర్తించి అందుకు అనుగుణంగా పురుగు మందుల అవశేషాలను నిర్మూ లించి పరిశోధనలను వేగంగా పూర్తి చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించా రు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.సుమతి, డాక్టర్ టి.మురళీకృష్ణ, ప్రతిమ మాట్లాడుతూ పంటల సాగు ప్రణాళికలు వివరించారు.

అనంతరం ఊటుకూరు వ్యవసాయ పరిశోదన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, డాట్ సెంటర్ సమన్వయకర్త అంకయ్యకుమార్, కృషి విజ్ఞా న కేంద్రం సమన్వయకర్త వీరయ్య రైతులతో గ్రూప్ సమీక్ష నిర్వహించా రు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన విస్తరణ కేంద్రాల శాస్త్ర వేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకు లు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతుడు అల్తాఫ్ హుసేన్ (ఫైల్)

మైదుకూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో నివాసముంటున్న మహమ్మద్ హుసేన్ కుమా రుడు అల్తాఫ్‌హుసేన్ (27) వృత్తి రీత్యా గుడిపాడు సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండేవా డు. అలాగే తన స్నేహితుల తో కలిసి కరెంటు పనులు ఒప్పందంతో చేసేవారు. ఇందులో భాగంగా మైదు కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళ వారం కరెంటు పనులు చేస్తుండగా షాక్ గురయ్యా డు. వెంటనే తోటి సిబ్బంది కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వారు తెలిపారు.

నిన్న తమ్ముడు.. నేడు కుమారుడు

మహమ్మద్ హుసేన్ తమ్ముడు అబ్దుల్లా రాజంపేటలో నివా సముంటూ సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా.. మైదుకూరులోనే సోమవారం సాయంత్రం అంత్య క్రియలు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం అల్తాఫ్ హుసేన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

వంద రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత



ప్రొద్దుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామం కోల్డ్ స్టోరేజీ వద్ద వాహనంలో తరలిస్తున్న వంద బస్తాల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మల్లికార్జున, ఎస్ఐ మహేంద్ర నాథ్‌రె డ్డిల ఆధ్వర్యంలో మంగళ వారం పట్టుకున్నారు. ఈ వాహనంలో 4300 కేజీల బియ్యం వంద బస్తాలలో ఉన్నట్లు గుర్తించారు. వాటిని చెరుకుచెర్ల వెంకటేష్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలను జమ్మలమడుగు రోడ్డు లోని ఎంఎల్ పాయింట్‌లో దించారు. వాహన డ్రైవర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



బి.కోడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిఒబిగాండ్ల మనోజ్ (25) మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివ రాల్లోకి వెళితే.. మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిఒబిగాండ్ల ప్రసాద్, పద్మావతి దంపతుల పెద్దకుమారుడైన మనోజ్ ఐటీఐ చదివి ఇంటి వద్ద నుంచి కొత్త ఇళ్లకు వైరింగ్ పనులుకు వెళుతుండేవాడు. అందులో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుంచి తన బైకులో పనికని చెప్పి వెళ్లిపోయిన మనోజ్ మంగళవారం సాయం త్రం లోయర్ సగిలేరు ప్రాజెక్టువద్ద ముళ్ల కంప పొదల్లో శవమై తేలాడు. శరీరం కూడా కుళ్లి దుర్వాసన వస్తుండ డంతో స్థానికులు గుర్తించి వారికి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బికోడూ రు హెడ్ కానిస్టేబులు శేఖర్ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం.. ఛీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాహుల్ అనే వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగంలో చేరినట్లు తాలుకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన రాహుల్ నాలుగేళ్ల క్రితం డీఎం హెచ్‌వో కార్యాలయంలో సూపర్‌వైజరుగా చేరాడని, అయితే అధికారులకు అనుమానం రావడంతో అతని సర్టిఫికెట్టును పరిశీలించారని తెలిపారు. ఆ సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో డీఎంహెచ్‌వో ఆఫీసు అధికారులకు ఫిర్యాదు మేరకు రాహు ల్‌పై ఛీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రూ.30 కోట్లతో బయో రిమిడియేషన్ ప్రారంభం



డంపింగ్‌యార్డు వద్ద చైతన్యరెడ్డి, శ్రీనివాసరెడ్డిలకు పనులను వివరిస్తున్న అధికారి

సీకేదిన్నె, మే 6 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులో రూ.30 కోట్లతో బయో రిమిడియే షన్ లెగసి వేస్ట్ రిక్లయేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలి సి ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె మండ లం కొలుములపల్లె పంచాయతీ పవర్‌గ్రిడ్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయోరిమిడియేష న్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ గత ప్రభుత్వం చెత్తపై కూడా ప న్నులు వేసి చెత్తను ఎక్కడికక్కడే వదిలేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆరో గ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలను వ్యాధులకు దూరంగా ఉంచాలని నిర్ణయిం చి.. నాలుగు లక్షల టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చి తడిపొడి చెత్తను వేరుచేసి రీ సైక్లింగ్ చేసేందుకు రూ.30 కోట్ల తో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంద న్నారు. గాంధీ జయంతి నాటికి ఈ కార్యక్ర మాన్ని పూర్తి చేసి స్వచ్ఛాంధ్ర సంకల్పాన్ని నెరవేర్చుతామన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యు డు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెత్తపై ప న్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని ఊడ్చివేసి కూ టమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చా రన్నారు. ప్రజల ఆశయాలు నెరవేర్చే విధం గా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కడప కమిషనర్ మనోజ్‌కు మార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్‌చం ద్ర, స్థానిక నాయకులు టక్కోలి వెంకటకృ ష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, అయ్యవారు, రవి రెడ్డి, వెంకటసుబ్బయ్య, డీవీ తదితరు లు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆదర్శ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు

● మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే6(ఆంధ్రజ్యోతి): ఆదర్శ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు అని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పాలకొండ్రాయుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా పనిచేసిన పాలకొండ్రాయుడు మృతి రాయచోటి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడ్డారని, ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచారని మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ మానస వెంకట్రమణ, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డెయ్య, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, కోఆప్షన్ అయ్యవారు రెడ్డి, తిరుపాల్‌నాయుడు, సయ్యద్ అమీర్, సుద్దమళ్ల జనార్దన్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి సేవలు చిరస్మరణీయం: గాజుల ఖాదర్‌బాషా

మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడి సేవలు చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు జమియా మసీద్ కమిటీ ప్రెసిడెంట్ ఫజిల్ ఇలాహి, హసన్‌బాషా, షాహుల్ హమీద్, ఇందాద్, మౌల్విసాబ్, ఎస్‌యండీ రఫీ, హైదర్ పాల్గొన్నారు.

సిద్దవటం: మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడి మృతి తీరని లోటని పట్ల సిద్దవటం మండలం టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం వారు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు నాగమునిరెడ్డి, రాజశేఖర్, సుబ్బారెడ్డి, మల్లు వెంకటసుబ్బారెడ్డి, రాజారాం పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మృతిపై సంతాపం

సుండుపల్లె, మే6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడి మృతిపై మంగళవారం సుండుపల్లె మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు క్రీడాకారులు, ఏపీయూడబ్ల్యుజే సంఘ నాయకులు తెలిపారు. రాజంపేట ఎంపీగా, రాయచోటి ఎమ్మెల్యేగా పాలకొండ్రాయుడు ఎనలేని కృషి చేశారని ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి టీడీపీకి తీరనిలోటు అన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు చెన్నంశెట్టి వెంకట్రమణ, రెడ్డెయ్యరాజు, భాస్కర్, ఏపీయూడబ్ల్యుజే నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





పాలకొండ్రాయుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి... నివాళులర్పిస్తున్న గాజుల ఖాదర్‌బాషా

పాలకొండ్రాయుడి మృతికి చమర్తి జగన్‌మోహన్‌రాజు సంతాపం

రాజంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : తెదేపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడి మృతికి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి కుటుంబంతో పాటు రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, తేదేపా కార్యకర్తలకు తీరని లోటు అని జగన్‌మోహన్‌రాజు అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన రాయచోటి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయనకు రాష్ట్ర నాయకులతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

స్నేహమే శాశ్వతం



బాధితుడికి డబ్బు అందజేస్తున్న స్నేహితులు

నందలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి):'స్నేహమేర జీవితం.. స్నేహమేర శాశ్వతం' అన్న పాటకు అద్దం పడుతుందీ ప్రక్రియ. తమ చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారు ఆందోళన చెందారు. అంతేకాదు.. మేమున్నాం అంటూ ఆర్థికంగా అండగా నిలిచారు. వివరాలు ఇవీ... మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ స్థానిక బస్టాండులో నాయీబ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వెంకటరమణ అనారోగ్యానికి గురయ్యాడు. వెంకటరమణ ఇటీవల గుండెపోటుకు గురికావడంతో ఆయన వైద్య చికిత్సల కోసం కలిసి చదువుకున్న స్నేహితులు పల్లె మాధవి, అల్లం అశోక్‌కుమార్, బోనాసి నరసింహులు, శ్రీధర్, ఆనాల నరసమ్మ, నాగసుబ్బయ్య, గులాం, కట్టా సుబ్బన్న చందాలు వేసుకుని మంగళవారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కాగా వెంకటరమణతో పాటు వీరంతా కలిసి నందలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

చిట్వేలి, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నాలుగు స్లాబుల్లో ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొదటి స్లాబు కింద రూ.1 లక్ష, రెండో స్లాబు కింద రూ.3 లక్షలు, మూడో స్లాబు కింద రూ.5 లక్షలు, నాలుగో స్లాబు కింద రూ.8 లక్షల రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. మైనార్టీ వర్గాలు(ముస్లింలు, బౌద్దులు, జైనులు, సిక్కులు, పార్శికులు) అర్హులన్నారు. అభ్యర్థి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అభ్యర్థి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలకు రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి అని, కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థి పాస్‌పోర్టు సైజు ఫొటో, రవాణా పథకం కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా జతపరచాలన్నారు. అర్హత, ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తుదారులను ఈనెల 25 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సంబంధిత సర్టిఫికెట్లు జతపరచాలని ఎంపీడీవో సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో మైనార్టీ కార్పొరేషన్ కడప, ఫోన్ నంబర్లు 9290448452, 08562-241137ను సంప్రదించాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యంస్వామికి పూజలు

రైల్వేకోడూరు, మే 6(ఆంధ్రజ్యోతి): భుజంగేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన సుబ్రహ్మణ్యం స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దూర్జటి యోగీస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి



రాజంపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ రామచంద్ర (43) మంగళవారం రాయచోటి బస్టాండులో గుండెపోటుతో మృతిచెందినట్లు ఆర్టీసీ కార్మికులు తెలిపారు. రాజంపేట నుంచి రాయచోటికి చేరుకోనున్న ఆర్టీసీ బస్సును బస్టాండు పాయింట్‌లో పెట్టి టిఫిన్ తిన్నారని, అనంతరం నీళ్లు పట్టుకోవడానికి ఆర్టీసీ బస్టాండులోని సెకండ్‌ఫ్లోర్‌కు వెళ్లి గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందినట్లు ప్రయాణికులు తెలిపారు. కాగా రామచంద్ర రాజంపేట మండలం పోలి గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయనకు భార్య, కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

తిరుమల రాయుడి సేవలో దేవదాయశాఖ అధికారి

సంబేపల్లె, మే6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ సమీపంలో వెలిసిన తిరుమల రాయ స్వామి ఆలయాన్ని మంగళవారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ రెడ్డి సందర్శించారు. తిరుమలరాయుడిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తిరుమలరాయగుట్ట ఆలయ విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు. ఆలయ సమీపంలోని పాతకాలపు నాటి నీటి దొన విశిష్టతను, కోనేరు నిర్మాణం, అభివృద్ధిపై చర్చించారు. వేసవి కాలంలోనూ దొనలో నీళ్లు నిల్వ ఉంటాయని పక్షులకు, భక్తులకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.కమిటీ సభ్యులు చల్లా చంద్రశేఖర్, రెడ్డెయ్య, శేఖర్, రెడ్డెయ్య, పూజారి పెద్దరెడ్డెప్ప, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని జనసేన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి మండలాలకు చెందిన ఐదుగురికి కలిపి మొత్తం రూ.5,83,695 అందించారన్నారు. రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లెకు చెందిన కస్తూరి చంద్రశేఖర్‌కు రూ.84,037, రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంటకు చెందిన సయ్యద్ ఫాతిమాకు రూ.3,03,920, ఓబులవారిపల్లె మండలం వై.కోటకు చెందిన ఉమ్మక జయమ్మకు రూ.70,442, చిట్వేలికి చెందిన ఆనందల సుబ్బన్నకు రూ.95,752, కే.కందులవారిపల్లెవాసి దానసి పెంచలమ్మకు రూ.29,544 చెక్కులు పంపిణీ చేశామన్నారు.

'అన్ని మతాలకు ఆత్మీయుడు పవన్ కళ్యాణ్'

అన్ని మతాలకు ఆత్మీయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ అని ఎమ్మెల్యే, అరవ శ్రీధర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ముస్లిం ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రసంగాన్ని వక్రీకరించి ముస్లిం సమాజాన్ని కించపరిచినట్లు వండి వారిస్తున్న వైసీపీ నాయకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముస్లిం నాయకులు సిద్దిక్, షబ్బీర్, షేక్ హటేల్, షేక్ లాలు, జనసేన నాయకులు పగడాల వెంకటేష్, బీదం నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, ముక్కా వరలక్ష్మి

రుతుక్రమం సమయంలో జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం



మాట్లాడుతున్న పీడీ ఉమాదేవి

లక్కిరెడ్డిపల్లె,మే6(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు రుతు క్రమం సమయంలో జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో కిశోర వికాసంపై కిశోర బాలికలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ రమాదేవి మాట్లాడుతూ 8 నుంచి 18 సంవత్సరాలలోపు రుతు క్రమం జరుగుతుందని, దీనికి బాలికలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రుతు క్రమం అనేది సాధారణ జీవన ప్రక్రియ అని, ఇది ఆడపిల్లలకు తప్పనిసరిగా ఉంటుందన్నారు. ప్రతి నెలా రుతు క్రమ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చిట్వేలిలో ఘనంగా గంగమ్మతల్లి జాతర ఏర్పాట్లు

చిట్వేలి, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చిట్వేలిలో ఎట్టకేలకు గంగమ్మ జాతర ఏర్పాట్లు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 8న గురువారం జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి నుంచి దున్నపోతును పూలహారం వేసి వీధుల్లో తిప్పారు. భక్తులు పూజలు చేసి చల్ల సమర్పించారు. కుమ్మరవీధిలో తయారైన గంగమ్మతల్లి పోతులరాజు సమేతంగా గురువారం తెల్లవారుజామున గుడికి బయలుదేరుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పందేరపు బండ్లు తిరుగుతాయని తెలిపారు. భక్తులు గంగమ్మతల్లిని దర్శించుకు మొక్కులు తీర్చుకోవాలని జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈనెల 8న జరగనున్న గంగమ్మతల్లి జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రఘురాం ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే సహించేది లేదని అట్టి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు

సంబేపల్లె, మే6(ఆంధ్రజ్యోతి): శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో సోమవారం రాత్రి కాలజ్ఞానం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు కార్యక్రమం గ్రామస్తులు చేపట్టారు. ట్రాక్టర్‌పై స్వామి వారు పల్లకీని ఉంచి పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో స్వామి వారికి టెంకాయ, కర్పూరం సమర్పించుకుని భక్తిని చాటుకున్నారు. బుధవారం స్వామి వారి ఆరాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు.

గాలివీటమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



గాలివీటమ్మకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్న దృశ్యం

గాలివీడు, మే6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పవిత్ర కుషావతి నదీ తీరాన వెలిసిన గాలివీటి గంగమ్మకు వీరబల్లి వాస్తవ్యులు కీర్తిశేషులు గాలివీటి విశ్వనాధరెడ్డి కుటుంబ సభ్యులు, కుమార్తెలు, అల్లుళ్లు పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం గేటు వద్ద నుండి మేళతాళాలతో, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా స్టాండు మీదుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గోపనపల్లె వాస్తవ్యులు మిట్టపల్లి వెంకట్రమణరెడ్డి, పుల్లారెడ్డి చెక్కభజనలు ఏర్పాటు చేయగా, పప్పిరెడ్డి భారతి, పప్పిరెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డిలు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 12, 13వ తేదీల్లో గాలివీటమ్మ తిరుణాలను అత్యంత వైభవోపేతంగా జరగపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చెట్టుకొమ్మలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం

రైల్వేకోడూరు, మే 6(ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ప్రధానదారిపై మంగళవారం చెట్టుకొమ్మలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అనంతరాజుపేట ఎంపీటీసీ సభ్యుడు బండారు మల్లికార్జున గ్రామస్థుల సహకారంతో చర్యలు తీసుకున్నారు. ప్రధానదారికి పక్కనే ఉన్న ఉద్యాన కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చెట్టు కొమ్మలు ఎత్తివేయించేశారు.

వైభవంగా సీతా జయంతి వేడుకలు

ఒంటిమిట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో సీతాజయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు శ్రావణ కుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, అధికారులు హనుమంతయ్య, గంగులయ్యనాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యకు పరిష్కారం

రాయచోటి(కలెక్టరేట్), మే6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు మంగళవారం భూ సమస్యకు పరిష్కారం చూపారు. వండాడి గంగులమ్మ తన భూమిని ఆక్రమించారని గత సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ వంశీరెడ్డిని ఆదేశించారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు మాసాపేట గ్రామం శెట్టివాండ్లపల్లె పొలం సర్వే నెంబర్ 461-2లోని 2.23 ఎకరాలను పరిశీలించారు. ఈ మేరకు డీకేటీ పట్టా గంగులమ్మ పేరు మీద ఉందని, అయితే అందులో దాదాపు పది సంవత్సరాలుగా వేరే వాళ్లు మామిడి చెట్లు పెంచారన్నారు. దీంతో ఆ భూమిని గంగులమ్మకు అప్పగించినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. మామిడి చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించినట్లు తెలిపారు.

ప్రకృతి ఆధారిత వ్యవసాయమే మేలు

చిన్నమండెం, మే6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆధారిత వ్యవసాయమే మేలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హార్టికల్చర్ ఆఫీసర్ వనిత మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, కంపోస్టు తయారీ గ్రామ స్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. హార్టికల్చర్ ఆఫీసర్ వనిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలి సాధ్యమవుతుందని తెలిపారు.

పీఎం సురక్ష బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ముబారక్

లక్కిరెడ్డిపల్లె, మే6(ఆంధ్ర జ్యోతి):కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ ముబారక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో అంగన్వాడీ కార్యకర్తలకు డిపాజిట్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సీసీలు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రాచరాయుడు, కళాజాత రాఘవేంద్ర, అంగన్వాడీ వర్కర్లు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికుల సంఘం నేతలు

రాజంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రెండోరోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈఎస్ఐ ఇంతవరకు అమలు కాకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, రవిశంకర్, పండు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



పూజలందుకున్న సీతారాములు

పుల్లంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని భద్రావతి సమేత భావన రుషి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాములకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం సీతారాఘవులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి పూజ చేశారు.

ఏఐటీయూసీ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

రాజంపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మదనపల్లెలో ఈనెల 10, 11 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు కార్మికులు హాజరై విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద శిక్షణ తరగతులకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, రమణ, ఏఐటీయూసీ రాజంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, ఉప్పు చంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, పెంచలయ్య, చందు, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలను వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు తపాల శాఖలోని పథకాలను వినియోగించుకోవాలని ఓబులవారిపల్లె సబ్‌పోస్టు మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. బాలికల భవిష్యత్‌కు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ఉపయోగమన్నారు. అలాగే ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం కూడా ఉపయోగమన్నారు. ఆర్డీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవడం ద్వారా పొదుపు చేసుకుని భవిష్యత్ అవసరాలను తీర్చుకోవచ్చునన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాల ద్వారా ఎంతో ప్రయోజనం ఉందన్నారు. 18 నుంచి 70 సంవత్సరాల లోపు ప్రతిఒక్కరు ఈ పథకాలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు భద్రావతి భావనారాయణ స్వామి కల్యాణం



భద్రావతి భావనారాయణ స్వామి

సిద్దవటం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 గ్రామంలోని భద్రావతి సమేత భావనారాయణ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో నేటినుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, సుదర్శన శాంతిహోమం, సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం అనంతరం గజవాహన ఉత్సవం, గురువారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం మహానైవేద్యంలు, స్వామివారి పవళింపు సేవ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారన్నారు. అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఒంటిమిట్ట ఎంపీడీవోగా గౌస్‌బాషా

ఒంటిమిట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట ఎంపీడీవోగా గౌస్‌బాసా నియమితులయ్యారు. ఈయన చిత్తూరు జిల్లాలో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఒంటిమిట్టకు ఎంపీడీవోగా వస్తున్నారు. ముందుగా ఇక్కడ ఉన్న ఎంపీడీవో కుళాయిబాబు ఇన్‌చార్జిగా ఉన్నారు. కొత్తగా నియమితులైన ఎంపీడీవో గౌస్‌బాషా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు పాగేటి గంగమ్మ జాతర

సంబేపల్లె, మే6(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లి వద్ద వెలిసిన పాగేటి గంగమ్మ జాతర నేడు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద భక్తుల కోసం ఎస్‌టూ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

బండికనుమ రోడ్డుపై తప్పిన పెను ప్రమాదం

సిద్దవటం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మాచుపల్లె - కడప రహదారి బండికనుమ మలుపు వద్ద పెను ప్రమాదం తప్పడంతో అటు వాహనదారులు, చోదకులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం హిందూపురం నుంచి బద్వేలు గ్రామానికి చింతపండు రవాణా చేస్తున్న లారీ బండికనుమ మలుపు వద్ద కడపకు వెళుతున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా రహదారికి లారీ అడ్డంగా ఉండడంతో మాచుపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె, ఖాజీపల్లె తదితర గ్రామాల నుంచి కడప వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిపడ్డారు. తర్వాత ఎక్స్‌కవేటరు సాయంతో లారీని తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

మదనపల్లి డివిజన్‌లో 8 బ్లాక్ స్పాట్స్

● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఎనిమిది ప్రాంతాలను రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలుగా గుర్తించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళ వారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముదివేడు పోలీసు స్టేసన్ పరిధిలో ఒకటి, తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు, బి.కొత్తకోట పరిధిలో ఒకటి, మదనపల్లె వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు చోట్ల ఉన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతాల్లో సైడ్ బోర్డులు, సీసీ కెమెరాలు, రేడియం స్టికర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో విద్యార్థులు, పిల్లలు ఈతకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈతకు కావాల్సిన సామగ్రి తోనే చెరువు, బావుల్లో పెద్దల సమక్షంలో ఈత ఆడాలన్నారు. చెరువులు, బావులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వేసవి సెలవుల్లో ఊళ్లకు, వెళ్లే వారు విలువైన వస్తువులు తమ బంధువులకు అప్పగించి వెళ్లాలని సూచించారు. సమీపంలోని పోలీసులకు విషయం తెలిపితే ఎన్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు, పోలీస్ బీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే శక్తి యాప్ ద్వారా మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతి


మహదేవ (ఫైల్)

కలికిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న పలపందల మహదేవ (39) ట్రాక్టర్ ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. సోమవారం ఉదయం ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్యం పని ముగించి చెత్తను వేసేందుకు ట్రాక్టర్‌ను ఎక్కే క్రమంలో పట్టుజారి కింద పడిపోయాడు. రోడ్డుపై వెల్లకిలా పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తిరుపతి ప్రభుత్వ రూయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానిక వెంకటేశ్వరపురానికి చెందిన మహదేవ గత దశాబ్దకాలంగా పంచాయతీలో పారిశుధ్య కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. మృతుడు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...


శ్రీనివాసరాజు

రాజంపేటటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ సమీపంలో మంగళవారం కారు - బైకు ఢీకొన్న సంఘటనలో చంద్రరాజు శ్రీనివాసరాజు(46) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... శ్రీనివాసరాజు ఊటుకూరులోని తన ఇంటిలో చిన్నషాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ద్విచక్రవాహనంపై రాజంపేటకు వెళ్లి అంగడి సరుకులు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కడప నుంచి చెన్నైకి వెళుతున్న కారు అతివేగంతో వచ్చి బైకు ఢీకొనడంతో శ్రీనివాసరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గుర్తించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని భవన నిర్మాణ కార్మికుడు...


చలపతి (ఫైల్)

మదనపల్లెఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో భవన నిర్మాణ కార్మికుడు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. తాలుకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం, కాట్లాటపల్లె రోడ్డు నీరుగట్టువారిపల్లెకు చెందిన చలపతి (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఉరివేసుకుని మృతి చెందాడు. తాలుకా పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పటిష్ఠమైన భద్రతా చర్యలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా భారత హోం మంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, డిఫెన్స్ రూల్స్ 1968 లోని సెక్షన్ 19 కింద హోం వ్యవహారాల మంత్రిత్వ భారత ప్రభుత్వం నిర్దేశించిన జిల్లాలోని పౌరరక్షణ మాక్ డ్రిల్, రిహార్సల్ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భూభాగాల్లో పౌరరక్షణ యంత్రాంగాల సంసిద్ధతను అంచనా వేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రణాళిక ప్రకారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వలంటీర్లు, హోంగార్డులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌వైకేలు, కళాశాల, పాఠశాల విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణతో దేశం చేపట్టే పౌరరక్షణ, చర్యల కార్యాచరణ, సమర్థత, సమన్వయాన్ని అంచనా వేస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గురుపూజ మహోత్సవాలు


నరనంది ఉత్సవంలో బ్రహ్మంగారు, గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 6 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మంగళవారం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబలు గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరబ్రహ్మంగారి ఆరాధన, నిత్యాన్నదాన సేవాసంఘం విజయవాడ గురుస్వాములు చేపట్టారు. మధ్యాహ్నం దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, అన్నదానం దేవస్థానం వారు చేప ట్టారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల చేత భరతనాట్యం, కోలాటం సాంస్కృతిక భక్తిగీతాలు, భజనలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు బ్రహ్మంగారి సమేత నరనంది ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు పాపయ్యగారి కుమార్తె వెంకటమ్మ, రామాపురం, బద్వేలు వాస్తవ్యులు నరనంది ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం హరికథా కాలక్షేపం చేపట్టారు.

ఎందుకింత నిర్లక్ష్యం...!


మదనపల్లె బీటీ కళాశాలలో అర్ధంతరంగా ఆగిన రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజి



- రవీంద్రుడు నడయాడిన నేల..
- పుష్కరకాలంగా అసంపూర్తి నిర్మాణం
- ఎస్‌డీఎఫ్ నిధులు పెండింగ్
- సీఎం హోదాలో కిరణ్‌కుమార్‌రెడ్డి వరం
- నేటి కూటమి నేతలతోనైనా పూర్తయ్యేనా?

మదనపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): రవీంద్రుడు నడయాడిన నేల అది. జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించిన ప్రాంతం. బ్రిటీష్ వనిత డాక్టర్ అనీబిసెంట్ స్థాపించిన విద్యాలయం. రాయలసీమలోనే మొదటి డిగ్రీ కళాశాల. అందులో ప్రముఖులు విద్యనభ్యసించి రాజకీయంగా, ఉద్యోగపరంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్న బీటీ కళాశాల అది. అలాంటి ప్రముఖ కళాశాలకు అనుబంధంగా నిర్మించ తలపెట్టిన రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీ, ఆడిటోరియం, మెడిటేషన్ హాలు, ఆస్తుల పరిరక్షణకు ఉద్దేశించి ప్రహరీ నిర్మాణ పనులు పుష్కరకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. అవి వినియోగంలోకి రాకనే పిచ్చిమొక్కల మధ్య నిర్మాణాలు వెక్కిరిస్తూ, శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నేటి కూటమి ప్రభుత్వంలోనైనా పనుల్లో వేగం పెంచాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

అప్పట్లో బీటీ కళాశాల అభివృద్ధి పనులకు అడుగు లేసిన నాటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పట్లో అభివృద్ధి పనులకు నిధులు సాధించిన అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాలు ఇద్దరూ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అప్పట్లో నిధులు సాధించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సీఎం హోదాలో నిధులు మంజూరు చేసిన కిరణ్‌కుమార్ రెడ్డిలు పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

బీటీ కళాశాల అభివృద్ధికి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సీఎం హోదాలో 2012-14 మధ్య కాలంలో స్పెషల్ డెవలప్‌మెంట్ (ఎస్‌డీఫ్) పథకం కింద నిధులు మంజూరు చేశారు. జాతీయగీతం ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇక్కడి కళాశాలలో 2012 జనవరి 24న జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం హోదాలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేస్తూ వరాలజల్లు కురిపించారు. ఇందులో రవీంద్రనాథ్‌ఠాగూర్ కాటేజీ, మ్యూజియం, ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో ప్రహరిగోడ మినహా మిగిలిన పనులన్నీ మొదలై అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇందులో రూ.2.86 కోట్లు విలువ చేసే పనులు పూర్తి కాగా, మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆడిటోరియం, కాటేజీ పనులు స్లాబ్ వరకు పూర్తి కాగా, మెడిటేషన్ పనులు పిల్లర్ల దశలో ఆగిపోయాయి. అప్పట్లో ఈ ఉత్సవాలను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న, ఇప్పటి టీడీపీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నిర్వహించగా, సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని పట్టుపట్టి మదనపల్లెకు రప్పించారు. ఆయన చేత బీటీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు ప్రారంభమయ్యాయి. తర్వాత 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రారంభమైన పనులన్నీ ఆగిపోయాయి. తిరిగి నేటి కూటమి ప్రభుత్వంలో ఆ పనులు పూర్తి చేయాలని స్థానికులతో పాటు బీటీ కళాశాల పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. మరోవైపు వారిద్దరూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులు కావడంతో పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన ఈ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో మెడిటేషన్ హాలు నిర్మాణం పిల్లర్ల దశలో పిచ్చిమొక్కలు, కంప చెట్ల మధ్య నిండుకుపోయింది. అలాగే ఆడిటోరియం వినియోగంలోకి రాక, మద్యంప్రియులకు షెల్టర్‌గా, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.

జిల్లా వ్యాప్తంగా రూ.5.50 కోట్లతో 225 పనులు

పంచాయతీరాజ్ పరిధిలో రూ.3 కోట్లతో 53 పనులు, రోడ్లు, భవనాల శాఖ రూ.కోటి, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో రూ.2 కోట్లు పనులు మంజూరు చేశారు. అప్పటి సీఎం సొంత నియోజకవర్గం పీలేరుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వగా, ఇందులో కలకడ, వాల్మీకిపురంలో జూనియర్ కళాశాల భవనాలు, కలికిరిలో నాక్ భవనం మంజూరు చేశారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి బోర్లు, పైపులైన్లు, పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు, రోడ్లు, భవనాల శాఖాధికారులు జూనియర్ కళాశాల భవనాలు, కలికిరిలో నాక్ భవనాలు, సాంఘిక సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు మదనపల్లెలోని బీటీ కళాశాలలో ఆడిటోరియం, రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీ, మెడిటేషన్ హాలు, కళాశాల ఆస్తుల పరిరక్షణకు ప్రహరీగోడ, సబ్‌కలెక్టర్ కార్యాలయం భవనాలు, తదితర పనులు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మంజూరైన పనుల్లో సగానికి పైగా పూర్తికాగా బిల్లులు చెల్లించేశారు. తర్వాత 2014లో అసెంబ్లీ ఎన్నికలు రావడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లుల చెల్లింపులకు బ్రేక్ పడింది. ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో అప్పటికే కాంట్రాక్టర్లకు జారీ చేసిన చెక్కులు చెల్లలేదు. దీంతో కొంతమంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. పనులపై క్షేత్రస్థాయిలో కమిటీ నివేదిక ఆధారంగా బిల్లులు చెల్లించారు. మిగిలిన పనులన్నీ అప్పటి నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్నాయి.


బీటీ కళాశాల మైదానంలో పిల్లర్లకే పరిమితమైన మెడిటేషన్ హాలు

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

- 810 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
- నలుగురి అరెస్టు


వై.కోట అడవుల్లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

రైల్వేకోడూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖాధికారులు మంగళవారం కోడూరు మండలం కె.బుడుగుంటపల్లె, ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామాలలో మెరుపుదాడులు చేసి 810 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కోడూరులో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఓబులవారిపల్లె పోలీసుల ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడి దాడులు చేశామన్నారు. కె.బుడుగుంటపల్లె గ్రామంలో 210 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నాగేశ్వర్‌రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి దగ్గర నుంచి 260 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వై.కోట గ్రామంలోని సిద్ధులయ్యగుట్ట, పాలకూరవంక దగ్గర దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కోనేటి మణి, సుబ్రహ్మణ్యంలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే ఈనెల 2న బుడుగుంటపల్లెలో కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తన సిబ్బందితో దాడులు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన ప్రశాంత్, నందా, నాగయ్య, పెంచలమ్మ దాడికి పాల్పడినట్లు తెలిపారు. వీరికి సహకరించిన మరో 8 మంది స్థానికులను గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. దాడికి ప్రయత్నించిన వారిపై ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి రవి, సీఐ జహీర్, కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి, రాజంపేట సీఐ మల్లిక, టాస్క్‌ఫోర్సు సీఐ ఎల్లయ్య, ఎస్‌ఐ హేమకుమార్, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి/ ముగ్గురు అరెస్టు


బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పులివెందులటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారా స్థావరాలపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. 'పులివెందులలో నాటు..ఘాటు' యథేచ్ఛగా నాటుసారా తయారీ.. అన్న కథనం మంగళ వారం ప్రచురితమైంది. ఇందుకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మంగళవారం స్టేషను పరిధిలోని ఉలిమెల్ల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ ప్రాంతాలపై దాడులు చేశారు. సారా తయారీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశారు. అంతే కాకుండా 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలైన నగరిగుట్టకు చెందిన కె.శివశంకర్, నీలకంటేశ్వర, కుళ్లాయప్పలను అరెస్టు చేసి రిమాండు నిమిత్తం పులివెందుల సబ్‌జైలుకు పంపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారాను నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకుంటూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరిగుట్ట, రామిరెడ్డిపల్లె, అంబకపల్లె, కల్లూరిపల్లి తాండా, కుప్పతాండాలలో నవోదయం 2.0లో భాగంగా సారాను పూర్తిగా నిర్మూలించడం జరుగుతుందన్నారు. ప్రజలు, నాయకులు, పాత్రికేయులు, ప్రజాసంఘాల వారు నవోదయం 2.0లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టరు ఎస్‌ఐ రామప్రసాద్, సిబ్బంది మల్లిఖార్జునప్రసాద్, జగదీశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- అరటి, తమలపాకు, మామిడి రైతులకు నష్టం
- ఇంట్లో పిడుగుపాటు - తప్పిన ప్రమాదం


చిన్నఓరంపాడు - ఓబులవారిపల్లె మధ్యలో విరిగిన విద్యుత్ స్తంభం

ఓబులవారిపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన గాలివానకు అపార నష్టం వాటిల్లింది. ఓబులవారిపల్లె పంచాయతీకి చెందిన ఓబిలి శ్రీనివాసులరెడ్డి ఇంటిలో పిడుగు పడడంతో ఇంటిలోని ఫ్రిజ్, బీరువాలు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అదేవిధంగా ఓబులవారిపల్లె, చిన్నఓరంపాడు క్రాస్ మధ్యలో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. భారీ గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్‌లైన్లు తెగిపోయి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వందలాది ఎకరాలు అరటికి నష్టం వాటిల్లింది. చిన్నఓరంపాడు, గాదెల, వై.కోట, బాలిరెడ్డిపల్లె, చెన్నరాజుపోడు గ్రామాల్లో తమలపాకు, అరటి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు...

మదనపల్లెఅర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై యువకుడు చిత్తూరు జిల్లాలోని పట్టణంలో పురుగుల మందుతాగి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు.. మదనపల్లె పట్టణం కురవంకకు చెందిన వీరవెంకట నాగరాఘవేంద్ర వ్యాస కుమార్ (42), తన భార్య చిత్తూరులో నర్సుగా పని చేస్తుండడంతో అక్కడే ఉండేవాడు. కుటుంబ కలహాలతో చిత్తూరుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఈ నెల 1న ఆత్మహత్యకు యత్నించాడు. వేలూరులో చికిత్స పొందుతుండేవాడు. పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి మదనపల్లెలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని శవపరీక్షల గదికి తరలించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం...

● ఆక్రమణదారులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, మే 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివార్లలోని వినాయక చేనేతనగర్‌లో విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నించిన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 633-11లో 0.15 సెంట్ల ప్రభుత్వ డీకేటీ భూమి ఉంది. అయితే ఈ భూమిని మదనపల్లె పట్టణానికి చెందిన కొంతమంది ఎక్స్‌కవేటర్‌తో కొంత స్థలాన్ని చదును చేశారు. దీనిపై చుట్టు పక్కల వారు ప్రశ్నించగా తమకు పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి ఆ భూమికి సంబంధించిన రికార్డులు తమకు చూపించాలని కోరారు. దీంతో వారు ఇంటి వద్ద ఉన్నాయని కార్యాలయానికి తెచ్చి చూపిస్తామన్నారు. ఈ విషయమై తహశీల్దార్ తపస్విని, ఆర్‌ఐ బాలసుబ్రమణ్యంలు మాట్లాడుతూ ఈ భూమిలో బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలో ఆక్రమణకు గురైన స్థలాలకు సంబంధించి తమకు దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా మండల పరిధిలో నిత్యం భూ వివాదాలు జరుగుతుండంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.


భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

బండరాళ్లతో కొట్టి హత్యాయత్నం


బండరాళ్లతో బాదడంతో తీవ్రంగా గాయపడిన బాలాజి

నిమ్మనపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని రాత్రి సమయంలో బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం మండలంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలంలోని బండ్లపై పంచాయతీకి చెందిన ఉషకు 15 ఏళ్ల క్రితం రాయచోటి మండలం అబ్బవరం పంచాయతీ ఇందుకూరుకు చెందిన బాలాజితో వివాహమైంది. వీరికి ఒక కూమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అయితే కొన్నేళ్లుగా బాలాజి తన కుటంబంతో కలిసి రాయచోటిలో వుంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. గత మూడు నెలలుగా భార్య భర్తల మధ్య కుటంబ కలహాలు రావడంతో ఉష తన పుట్టినిళ్లు అయిన బండ్లపై వచ్చి ఇక్కడే వుండేది. కాగా తన భార్య కాపురానికి రాకపోవడంతో 15 రోజుల క్రితం బాలాజి కూడా బండ్లపై వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యభర్తలు ఇద్దరూ కలసి బహిర్భూమికి బయటకు వెళ్లారు. ఇదే అదునుగా చేసుకొని కొందరు దుండగులు ముసుగు ధరించి బండరాళ్లతో బాలాజి తలపై బలంగా మోదారు. దీంతో తలకు తీవ్రగాయాలు కాగా స్పృహతప్పి పడిపోయాడు. రక్తపు మడుగులో వున్న బాలాజిని మదనపల్లికు తరలించగా అక్కడ వైద్యులు తిరు పతి రూయాకు రెఫర్ చేశారు. కాగా భార్య ఉషా మరోక వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పరచుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. దీనిపై బాలాజి తల్లి రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

కడప ఎడ్యుకేషన్, మే 6 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సీడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని గ్రామీణ నిరుద్యోగ యువ తకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించ నున్న ట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజా సింగ్ తెలిపారు. మంగళవారం కడప నగరం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ డీడీయు-జీకేవై పథకం ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవ లపర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్, బ్యూటీ థెరపీ కోర్సులలో నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, కంప్యూటర్ నైపుణ్యా లు, స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్ శిక్షణ కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్‌తో పాటు అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలి పారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలని. అర్హతకు అనుగుణంగా కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పుష్పగిరిలో హుండీ లెక్కింపు.. రూ.7,59,762 ఆదాయం



హుండీ లెక్కింపు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

వల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి క్షేత్రం లక్ష్మీ చెన్న కేశవస్వామి దేవస్థానంలో హుండీలను లెక్కించగా రూ.7,59,762 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివా సులు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 25 నుంచి మే 4వ తేదీ వరకు సేవా టికెట్ల ద్వారా రూ.69,750, అన్న దానం కోసం భక్తులు ఇచ్చిన చందాలు 78,285, శాశ్వత హుండీ ద్వారా రూ.6,11,462 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మొత్తం డబ్బును దేవ స్థానం బ్యాంకులో జమ చేస్తామన్నారు. జిల్లా దేవదా యశాఖ కమిషనరు జి.మల్లికార్జున, శాశ్వత దేవస్థానచైర్మన్ బి.వెంకట సుబ్బారెడ్డి, పురావస్తుశాఖ, దేవదాయశాఖ సిబ్బం ది, అర్చకులు, పూజార్లు భక్తులు పాల్గొన్నారు.

అగ్రీగోల్డ్ భూముల పరిశీలన



అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

సింహాద్రిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోమ డ గ్రామంలో ఉన్న 79 ఎకరాల 42 సెంటల్లో ఉన్న అగ్రి గోల్డ్ భూములను తిరుపతి సీఐడీ శాఖ సీఐ రారాజు సింహాద్రిపురం తహసీల్దార్ నాగేశ్వరరావుతో కలసి మంగళ వారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యా క అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారంపై ఇచ్చిన హామీలో భాగంగా ఆ సంస్థకు సంబంధించిన ఆస్తుల వివరాలు ఆయా శాఖల అధికారుల ద్వారా సేకరిస్తున్నారు. ఇందులో భాగంగానే లోమడ గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయా ? లేక ఆక్రమణలో ఉన్నాయా అనే వివరాలపై సీఐడీ అధికారులు ఆరా తీసి సరిహద్దులను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. అగ్రిగోల్డ్‌కు సంబంధిం చిన భూముల ద్వారా వచ్చే సొమ్ముతో బాధితులకు సాయం అందించనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజగోపాల్, పుష్పరాజ్, సీనియర్ అసిస్టెంట్ సింగరయ్యలు పాల్గొన్నారు.

పులివెందుల ఆర్డీవోగా చిన్నయ్య

కలికిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారిగా జి.చిన్నయ్యను నియమిస్తూ ప్రభు త్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముద్దనూరు గాలేరు నగరి సుజల స్రవంతి యూనిట్-3 భూ సేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచే స్తున్న చిన్నయ్యను పులివెందుల ఆర్డీవోగా బదిలీ చేశారు. పులివెందుల ఆర్డీవో జి.భానుశ్రీ ప్రస్తుతం సెలవులో వున్నా రు. ఈమేరకు ప్రభుత్వ సాధారణ పరిపాల నాశాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

పంటల ధరలను రైతులే నిర్ణయించాలి

చెన్నూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు పండిస్తే వాటి ధరను రైతులే నిర్ణయించేలా అవగాహన కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ దక్షిణ భారత సంఘటనా అధ్యక్షు డు డి.రాము అన్నారు. చెన్నూరు ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం రెండో రోజు బీకేఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ నేటికీ రైతులు పండించిన ధరలను దళారులు, ప్రభుత్వాలు నిర్ణయిస్తు న్నాయన్నారు. అలా కాకుండా మన పంటకు మనమే ధర లు నిర్ణయించుకోవాల్సిన దిశగా రైతులు ఎదగాలన్నారు. గో ఆధారిత వ్యవసాయం, వాణిజ్యం కూడా రైతులే చేయా లనే నినాదం దిశగా ముందడుగులు వేయాలన్నారు. బీకేఎ స్ పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సహ దేవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జనార్ధనరెడ్డి, ఆదర్శ రైతు బాల చంద్ర, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వంలో 50 ఏళ్లు అభివృద్ధి వెనక్కి'

బ్రహ్మంగారిమఠం, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత జగన్ పరి పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నా రు. మంగళవారం ఆయన వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శిం చుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రెండు పార్టీలు ప్రజ లకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం నెరవేర్చలేదని అన్నా రు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఏ ఒక్క పథకం ప్రజలకు అందించడంలో విఫల మైందన్నారు. రాబోవు రోజుల్లో రెండు ప్రభుత్వాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 2029 ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థులను అంధకారంలోకి నెట్టిన జగన్

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, మే 6 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్కి టెక్చర్ విద్యార్థులను నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంధకారంలోకి నెట్టారని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాకు వీడియో పంపారు. అందు లో ఆయన మాట్లాడుతూ 2020లో డాక్టర్ వైఎ స్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఏదైనా యూని వర్సిటీని నెలకొల్పాలంటే అందుకు అనుమతులు తప్పకుండా తీసుకో వాల్సి ఉంటుందన్నారు. వారు పరిశీలించిన తర్వాత అన్ని సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉంటే అనుమతులు ఇవ్వడం జరుగుతుం దన్నారు. 2023-24 వరకు కూడా అనుమతులు లేకుండా నడిపార న్నారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా, ముందుచూపు లేకుండా కేవలం తన తండ్రి పేరు ఉండాలనే ఆలోచ నతో యూనివర్సిటీని కడపలో నెలకొల్పారని ఆరోపించారు. 2020లో అప్పట్లో 64 మంది విద్యార్థు లు కళాశాలలో చేరారన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి వారి కోర్సు పూర్తవుతుదన్నారు. వారికిచ్చే సర్టిఫికెట్ ఈ దేశంలో ఎక్కడేగాని చెల్లని పరిస్థితి ఉందన్నారు. ఆయనకు సం బంధించిన బంధువులకు రిజిస్ట్రార్ పోస్టులు, వారి అనుచరులకు ఉద్యోగాలు ఇవ్వాలనే దురాలోచన చేసి విద్యార్థులను అంధకారంలోకి నెట్టిన ఘనత మాజీ సీఎం జగన్‌దే అన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని సరిదిద్దా లని ప్రయ త్నించారని, అయితే అది సాధ్యం కాలేదని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన వీసీ అనేక ఆపసోపాలు పడ్డ తర్వాత 2022- 23, 2023-24కు సంబంధించి అనుమతులు వచ్చాయన్నారు. అయితే మొదటి బ్యాచ్‌లో చేరిన విద్యార్థులు మా భవిష్యత్ ఏంటని ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసు కెళ్లగా వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ ఆర్ఎం



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): బుద్ధ పూర్ణిమ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై (అరు ణాచలం)కు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి 8 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఆమేరకు మంగళవారం స్థాని క ఆర్టీసీ ఆర్ఎం కార్యాల యంలోని ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని కడప, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, డిపోల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా అరుణాచలానికి ప్రయాణికులు, భక్తులు సురక్షితంగా చేరుకుని స్వామివారిని దర్శించు కోవాలని కోరారు.

బస్సుల వివరాలిలా... : కడప డిపో నుంచి ఈ నెల 11న ఆదివారం ఉదయం 6 గంటలకు ఒక బస్సు, రాత్రి 9 గంటలకు ఒకటి, బద్వేల్ డిపో నుంచి అదేరోజు ఉదయం 9 గంటలకు, మైదుకూరు డిపో నుంచి మధ్యా హ్నం 3 గంటలకు, అదేవిధంగా ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు, జమ్మ లమడుగు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు, అదేరోజు రాత్రి 8 గంటలకు బస్సు సౌకర్యం ఉందన్నారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలకూ..: మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన, రథోత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మంగారిమఠానికి 76 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులు బుధవారం నుంచి బి.మఠానికి చేరుకోనున్నాయన్నారు. ఆ మేరకు మైదుకూరు డిపో నుంచి 54 బస్సులు, బద్వేల్ డిపో నుంచి 22 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి సోమవారం పొలతలకు..: పొలతల మల్లేశ్వరస్వామిని దర్శించు కునే భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం కడప, డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. కడప నుంచి ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు, తిరుగు ప్రయాణంలో పొలతల నుంచి కడపకు ఉదయం 11కు, మధ్యాహ్నం 3 గంటలకు బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

పరిశోధన ఫలితాలను త్వరితగతిన వెల్లడించాలి



మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు సత్యనారాయణ

సీకేదిన్నె, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పరిశోధన ఫలితాలను త్వరిత గతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించడమేకాక ప్ర భుత్వానికి సబ్సిడీ కూడా తగ్గుతుందని ఆచార్య ఎన్జీరంగ పరిశోధన సం చాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. దక్షిణ మండల వ్యవ సాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం రెండవ రోజు మంగళవారం శాస్త్రవేత్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ సమర్థతస్థాయి ని పరిశీలించాలని, పరిశోధన ఫలితాలు త్వరగా అందించడం వలన భూమి, నీరు, వాయుకాలుష్యాన్ని కూడా తగ్గించి పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. పురుగు మందుల అవశేషాలను, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లలో త్వరగా నిర్ధారించే పద్ధతులను గుర్తించి అందుకు అనుగుణంగా పురుగు మందుల అవశేషాలను నిర్మూ లించి పరిశోధనలను వేగంగా పూర్తి చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించా రు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.సుమతి, డాక్టర్ టి.మురళీకృష్ణ, ప్రతిమ మాట్లాడుతూ పంటల సాగు ప్రణాళికలు వివరించారు.

అనంతరం ఊటుకూరు వ్యవసాయ పరిశోదన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, డాట్ సెంటర్ సమన్వయకర్త అంకయ్యకుమార్, కృషి విజ్ఞా న కేంద్రం సమన్వయకర్త వీరయ్య రైతులతో గ్రూప్ సమీక్ష నిర్వహించా రు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన విస్తరణ కేంద్రాల శాస్త్ర వేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకు లు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతుడు అల్తాఫ్ హుసేన్ (ఫైల్)

మైదుకూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో నివాసముంటున్న మహమ్మద్ హుసేన్ కుమా రుడు అల్తాఫ్‌హుసేన్ (27) వృత్తి రీత్యా గుడిపాడు సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండేవా డు. అలాగే తన స్నేహితుల తో కలిసి కరెంటు పనులు ఒప్పందంతో చేసేవారు. ఇందులో భాగంగా మైదు కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళ వారం కరెంటు పనులు చేస్తుండగా షాక్ గురయ్యా డు. వెంటనే తోటి సిబ్బంది కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వారు తెలిపారు.

నిన్న తమ్ముడు.. నేడు కుమారుడు

మహమ్మద్ హుసేన్ తమ్ముడు అబ్దుల్లా రాజంపేటలో నివా సముంటూ సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా.. మైదుకూరులోనే సోమవారం సాయంత్రం అంత్య క్రియలు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం అల్తాఫ్ హుసేన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

వంద రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత



ప్రొద్దుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామం కోల్డ్ స్టోరేజీ వద్ద వాహనంలో తరలిస్తున్న వంద బస్తాల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మల్లికార్జున, ఎస్ఐ మహేంద్ర నాథ్‌రె డ్డిల ఆధ్వర్యంలో మంగళ వారం పట్టుకున్నారు. ఈ వాహనంలో 4300 కేజీల బియ్యం వంద బస్తాలలో ఉన్నట్లు గుర్తించారు. వాటిని చెరుకుచెర్ల వెంకటేష్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలను జమ్మలమడుగు రోడ్డు లోని ఎంఎల్ పాయింట్‌లో దించారు. వాహన డ్రైవర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



బి.కోడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిఓబిగాండ్ల మనోజ్ (25) మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివ రాల్లోకి వెళితే.. మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిఓబిగాండ్ల ప్రసాద్, పద్మావతి దంపతుల పెద్దకుమారుడైన మనోజ్ ఐటీఐ చదివి ఇంటి వద్ద నుంచి కొత్త ఇళ్లకు వైరింగ్ పనులకు వెళుతుండేవాడు. అందులో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుంచి తన బైకులో పనికని చెప్పి వెళ్లిపోయిన మనోజ్ మంగళవారం సాయం త్రం లోయర్ సగిలేరు ప్రాజెక్టువద్ద ముళ్ల కంప పొదల్లో శవమై తేలాడు. శరీరం కూడా కుళ్లి దుర్వాసన వస్తుండ డంతో స్థానికులు గుర్తించి వారికి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బికోడూ రు హెడ్ కానిస్టేబులు శేఖర్ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం.. ఛీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాహుల్ అనే వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగంలో చేరినట్లు తాలుకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన రాహుల్ నాలుగేళ్ల క్రితం డీఎం హెచ్‌వో కార్యాలయంలో సూపర్‌వైజరుగా చేరాడని, అయితే అధికారులకు అనుమానం రావడంతో అతని సర్టిఫికెట్లను పరిశీలించారని తెలిపారు. ఆ సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో డీఎంహెచ్‌వో ఆఫీసు అధికారులకు ఫిర్యాదు మేరకు రాహు ల్‌పై ఛీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రూ.30కోట్లతో బయో రిమిడియేషన్ ప్రారంభం



డంపింగ్‌యార్డు వద్ద చైతన్యరెడ్డి, శ్రీనివాసరెడ్డిలకు పనులను వివరిస్తున్న అధికారి

సీకేదిన్నె, మే 6 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులో రూ.30 కోట్లతో బయో రిమిడియే షన్ లెగసి వేస్ట్ రిక్లయేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలి సి ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె మండ లం కొలుములపల్లె పంచాయతీ పవర్‌గ్రిడ్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయోరిమిడియేష న్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ గత ప్రభుత్వం చెత్తపై కూడా ప న్నులు వేసి చెత్తను ఎక్కడికక్కడే వదిలేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆరో గ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలను వ్యాధులకు దూరంగా ఉంచాలని నిర్ణయిం చి.. నాలుగు లక్షల టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చి తడిపొడి చెత్తను వేరుచేసి రీ సైక్లింగ్ చేసేందుకు రూ.30 కోట్ల తో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంద న్నారు. గాంధీ జయంతి నాటికి ఈ కార్యక్ర మాన్ని పూర్తి చేసి స్వచ్ఛాంధ్ర సంకల్పాన్ని నెరవేర్చుతామన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యు డు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెత్తపై ప న్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని ఊడ్చివేసి కూ టమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చా రన్నారు. ప్రజల ఆశయాలు నెరవేర్చే విధం గా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కడప కమిషనర్ మనోజ్‌కు మార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్‌చం ద్ర, స్థానిక నాయకులు టక్కోలి వెంకటకృ ష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, అయ్యవారు, రవి రెడ్డి, వెంకటసుబ్బయ్య, డీవీ తదితరు లు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆందోళన

వేంపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీ రింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. కోర్సు పూర్తై బయట ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే కళాశాల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్లు, పాసింగ్ సర్టిఫికెట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం ఫైనల్‌లో ఉన్న విద్యార్థులు పరీక్షలు రాశారు.నో డ్యూస్ సర్టిఫికెట్ల కోసం వెళితే ఫీజు బకాయిలు చెల్లించాలంటూ అధికారులు మెలిక పెడుతు న్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో3,4 సంవత్సరాలకు సంబంధించి ఫీజు రీయింబ ర్స్‌మెంట్ మొత్తం పెండింగ్‌లో ఉంచడం వల్ల ఆ విద్యార్థులు ఫీజులు కట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు అవు తున్నా విద్యార్థుల ఫీజు బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. విద్యార్థుల బకా యిలు అలాగే నిలిచి పోయాయి. ప్రభుత్వం చెల్లించ కుంటే మాపై భారం మోపుతూ నోడ్యూస్ సర్టిఫికెట్ల వద్ద అభ్యంతరం చెప్పడం తగ దని విద్యార్థులు మంగళవారం సాయం త్రం ఒకటో అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజును బకాయి పెట్టిం దని, బకాయిలతో సంబంధం లేకుండా నోడ్యూస్ సర్టిఫికెట్లు, భవిష్య త్తులో పాసింగ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపు తున్న విద్యార్థులతో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, ఇతర అధికారులు చర్చలు జరిపారు. డైరెక్టర్ అందుబాటులో లేరు. వస్తూనే సమా వేశం ఏర్పాటు చేయించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పినప్పటికీ విద్యార్థులు ఆందోళనను కొనసాగిస్తున్నారు. మరో వైపు వేంపల్లె,ఆర్కేవ్యాలీ పోలీసులు ట్రిపుల్‌ఐటీకి చేరుకున్నారు. వేంపల్లె సీఐ నరసింహులు విద్యార్థులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా విద్యా ర్థులు నిరసన విరమించేది లేదని, తమకు ఆర్జీయూకేటీ అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.రాత్రి 9గంటలు దాటినా విద్యార్థులు తమ నిరసనను కొనసా గిస్తూనే ఉన్నారు.

ఆదర్శ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు

రాయచోటిటౌన్, మే6(ఆంధ్రజ్యోతి): ఆదర్శ నాయకుడు సుగవాసి పాలకొం డ్రాయుడు అని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మో హన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పాలకొండ్రాయుడి మృతదేహాన్ని సంద ర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాలు గు పర్యాయాలు ఎమ్మె ల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా పనిచేసిన పాలకొండ్రాయుడు మృతి రాయ చోటి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడ్డారని, ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచారని మోహ న్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ మానస వెంకట్రమణ, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డెయ్య, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగ వాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, కోఆప్ష న్ అయ్యవారురెడ్డి, తిరుపాల్‌నాయుడు, సయ్యద్ అమీర్, సుద్దమళ్ల జనార్ధ న్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడి మృతికి చమర్తి జగన్‌మోహన్‌రాజు సంతాపం

రాజంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : తెదేపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతికి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు సంతాపం వ్య క్తం చేశారు. ఆయన మృతి కుటుంబంతో పాటు రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, తేదేపా కార్యకర్తలకు తీరని లోటు అని జగన్‌మోహన్‌రాజు అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన రాయచోటి ప్రజల్లో చిరస్థా యిగా నిలిచిపోయారన్నారు. ఆయనకు రాష్ట్ర నాయకులతో ఎంతో అను బంధం ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి



రాజంపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాజం పేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ రామ చంద్ర (43) మంగళవారం రాయచోటి బస్టాం డులో గుండెపోటుతో మృతిచెందినట్లు ఆర్టీసీ కార్మికులు తెలిపారు. రాజంపేట నుంచి రాయ చోటికి చేరుకోనున్న ఆర్టీసీ బస్సును బస్టాండు పాయింట్‌లో పెట్టి టిఫిన్ తిన్నారని, అనం తరం నీళ్లు పట్టుకోవడానికి ఆర్టీసీ బస్టాండులోని సెకండ్‌ఫ్లోర్‌కు వెళ్లి గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందినట్లు ప్రయాణికులు తెలి పారు. కాగా రామచం ద్ర రాజంపేట మండలం పోలి గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయనకు భార్య, కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

బండికనుమ రోడ్డులో తప్పిన పెను ప్రమాదం

సిద్దవటం, మే 6 (ఆంధ్రజ్యోతి): మాచుపల్లె - కడప రహదారి బండికను మ మలుపు వద్ద పెను ప్రమాదం తప్పడంతో అటు వాహనదారులు, చోద కులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం హిందూపురం నుంచి బద్వేలు గ్రామానికి చింతపండు రవాణా చేస్తున్న లారీ బండికనుమ మలుపు వద్ద కడపకు వెళుతున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి కల్వర్టును ఢీకొం ది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా రహదారికి లారీ అడ్డంగా ఉండడంతో మాచుపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె, ఖాజీపల్లె తదితర గ్రామాల నుంచి కడప వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిపడ్డారు.

పద్ధతి మార్చుకోకుంటే ఇంటికే..!

- కార్యదర్శులకు డీఎల్‌పీవో హెచ్చరిక
- పంచాయతీ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ..



వెంగంవారిపల్లిలో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజ, ఏవో రమేష్ తదితరులు

నిమ్మనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ పద్ధతి మార్చుకోకపోతే ఇంటికి పంపిస్తానని డీఎల్‌పీవో నాగరాజ హెచ్చరించారు. మండలంలోని ముష్టూరు, వెంగంవారి పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మింగా తనిఖీ చేశారు. ముందుగా ముష్టూరు పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. పన్ను వసూళ్లకు సంబంధించిన రికార్డులు అసంపూర్తిగా ఉండడంతో కార్యదరి లోకేశ్వరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రికార్డులను కలెక్టర్‌కు చూపిస్తే మీ ఉద్యోగం పోవడం ఖాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సంపద కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన ఇంత అధ్వానంగా ఉండడం తాను చూడలేదని తెలిపారు. ఇంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తే సస్పెండ్ చేస్తానన్నారు. గతంలో వెంగంవారిపల్లి కార్యదర్శిగా పని చేసిన లోకేశ్వరి చేపల చెరువుల వేలం ద్వారా వచ్చిన మొత్తంలో రూ.1.30 లక్షలను దుర్వినియోగం చేశారని వె ంగంవారిపల్లి సర్పంచ్ వాణి భర్త నవీన్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఆయన లోకేశ్వరిపై ఆగ్రహం వ్యక్తం చేసి రెండు రోజుల్లో ఆ మొత్తాన్ని పంచాయతి ఖాతాకు జమ చేయాలని లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులు దాదాపు 3ఏళ్లుగా రికార్డులు రాయక పోవడంపై నిలదీశారు. వెంగంవారిపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు సక్రమంగా రాయడం లేదని కార్యదర్శి మమతపై మండిపడ్డారు. సంపద సృష్టి కేంద్రాలను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శులు పంచాయతీల్లో ఎలాంటి సమస్యలు వున్నా వెంటనే పరిష్కరించాలని, పనులు చేయక పోతే ఇంటికి వెళ్లిపోవచ్చని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీలోనూ వారం రోజుల్లో సంపద సృష్టి కేంద్రాలు మెరుగు పడాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, ఎమ్‌ఆర్‌సి గుర్రప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలున్న గర్భిణులను తొందరగా గుర్తించాలి

- జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఉషశ్రీ
- ఈ ఆశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

పీలేరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలున్న గర్భిణులను తొందరగా గుర్తించి తల్లీ బిడ్డలను కాపాడాల్సిన గురుతర బాధ్యత ఆశ వర్కర్లపై ఉందని అన్నమయ్య జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం పీలేరు మండలం రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో రోగులు వస్తారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఆశ కార్యకర్తలు గర్భిణి వివరాలు నమోదు చేసి నప్పటి నుంచి బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ ఆశ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని, అందులో ఆరోగ్య సేవలు నమోదు చేయాలని తెలిపారు. గర్భిణుల వివరాలు 12 వారాల లోపే నమోరు చేసి, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్‌సీడీ 3.0 సర్వే పర్సెంటేజీని పెంచాలని తెలిపారు. అన్ని రకాల టీకాలను కచ్చితంగా పోర్టల్‌లో నమోదే చేయించాలన్నారు. ఈ నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. గ్రామాలలో నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌వో జయలక్ష్మి, సూపర్‌వైజర్ రాజీమణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 3.27 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

పీలేరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలో రూ. 3.27 కోట్లతో సిమెంట్ రోడ్ల పనులు జరుగుతున్నాయని పీఆర్ డీఈ మధుసూదన రావు తెలిపారు. మంగళవారం పీలేరు పంచాయతీరాజ్ కార్యాలయంలో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల క్వాలిటీలో ఎక్కడా రిమార్క్ ఉండరాదని సూచించారు. మండలంలోని 15 పంచాయతీల్లో 79 పనులు ప్రారంభించగా, ఇప్పటి వరకు సుమారు 75 శాతం పూర్తి చేశామన్నారు. ఇందులో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని తెలిపారు. పెండింగ్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసి నివేదికలు అందించాలని ఆదేశించారు. కొత్తగా మరో రూ. 3 కోట్ల పనులు ఉన్నాయని, వీటికి సంబంధించిన ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఈ రామకృష్ణనాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యసూత్రాలు పాటించాలి



పెద్దతిప్పసముద్రం: కిశోరి వికాసం పై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గ్రామపోలీస్

మదనపల్లె టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు తప్పని సరిగా ఆరోగ్యసూత్రాలపై అవగాహన పెంచుకోవాలని సీడీపీవో సుజాత సూచించారు. మంగళవారం మండలంలోని బసినికొండ గ్రామ సచివాలయంలో కిశోర బాలికల సమ్మర్ స్పెషల్ ప్రోగ్రాంను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లైంగిక విద్య, రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకాంత, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామం అంకిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సూపర్‌వైజర్ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం సెషన్-2 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11- 18 ఏళ్లలోపు వయసు కలిగిన బాలికలు రుతుక్రమం సమయంలో పాటించ వలసిన జాగ్రత్తలను వివరించారు. లైంగిక విద్య, హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 112 ల వివరాలు తెలియజేశారు కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషక పదార్థాలను ప్రభుత్వం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్ వైజర్ నాగర్నమ్మ, మహిళా పోలీస్ ఇర్ఫాన్‌బేగం, అంగన్‌వాడి కార్యకర్త రమణమ్మతో పాటుగా హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయండి



మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్నరైతులు

గుర్రంకొండ, మే 6(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలంటూ రైతులు మంగళవారం కార్యదర్శి కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద క్రేట్లకు 20 క్రేట్లను జాక్ పాట్ విధానంలో దోచుకుంటున్నారని, 10 శాతం అధికంగా కమిషన్‌ను తీసుకుంటున్నారని కార్యదర్శికి తెలిపారు. మదనపల్లె, అంగళ్లు మార్కెట్ టమోటా ధరలు కంటే గుర్రంకొండ మార్కెట్ యార్డులో తక్కువ ధరలు పాడుతున్నట్లు వివరించారు. మార్కెట్‌లో జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయకుంటే జిల్లా కార్యాలయంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శి కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అమరనాథ్, సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రామకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో ధర్నాకు ముదివేడు రైతులు



విజయవాడకు వెళుతున్న నిర్వాసితులు

మదనపల్లె అర్బన్, మే6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న విజయవాడ కేంద్రంగా నిర్వహించే ధర్నాకు ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులు మంగళవారం మదనపల్లె సీటీఎం రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని ముదివేడు సమీపంలో రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బికొత్తకోట మండలంలోని కోటావూరు, కురబలకోట మండలం కురబలకోట, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. దీంతో 300 మంది రైతులు నిర్వాసితులయ్యారన్నారు. దిగువసీతివారిపల్లె, కొత్తపల్లె, చౌటకుంటపల్లె, దిన్నమీదవపల్లె గ్రామాలు పూర్తిగా మునిగిపోగా, వారికి పునరావాసం కూడా కల్పించలేదన్నారు. సీఎం జోక్యం చేసుకుని నష్ట పరిహారంతోపాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతులు రాజేష్, శ్రీనివాసులు, గంగారాజు, రెడ్డెప్ప, లక్ష్మీదేవి, రమణమ్మ, గణేస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు



ఉత్తమ ఉద్యోగులకు నగదు బహుమతులు అందిస్తున్న డిపో మేనేజరు అమరనాథ్

మదనపల్లె అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టూ డిపో పరిధిలో ఉత్తమ ఉద్యోగులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించినట్లు ఆ డిపో మేనేజర్ అమరనాథ్ తెలిపారు. మంగళ వారం ఆదర్శ ఉద్యోగుల సభ నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అదే ఒరవడితో ఉద్యోగులు శ్రమించి ఆర్టీసీ డిపో ఆదాయం పెంచడానికి కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి..



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ అధికారి రమాపతి

వాల్మీకిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి తెలిపారు. మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండే పుస్తక పఠనం అలవర్చుకుంటే విజ్ఞానం పోటీ పరీక్షలలో సైతం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

రామసముద్రం,మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం సచివాలయ సిబ్బంది ద్వారా అవసరమైన వారికి ఈనెల 6, 7, 8 తేదీల్లో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో భాను ప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా ఎన్ఆర్ఈజీఎస్‌లో పని చేసే కార్మికులకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. గ్రామంలోని ప్రజలు ఎవరైనా వేసవి వడదెబ్బకు గురైనప్పుడు వెంటనే ఎలక్ట్రోలైట్స్ తాగించి వారిని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడాలని సిబ్బందికి సూచించారు. ప్యాకెట్లు దుర్వినియోగం కాకుండా అర్హులు అందరికీ పంపిణీ చేయాలని ఎంపీడీవో సూచించారు.

9న ఆలయ భూముల వేలం

పెద్దతిప్పసముద్రం మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చెన్నకేశవ , విరూపాక్షేశ్వరస్వామి ఆలయాలకు చెందిన భూములను మూడేళ్లపాటు సాగు చేసుకునేందుకు ఈ నెల 9వ తేదీన స్థానిక చెన్నకేశవస్వామి ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎద్దుల మునిరాజ్ తెలిపారు. ఈ ఆలయాలకు సంబంధించిన భూములు మండలంలోని బూర్లపల్లె పోతుపేట, పిడుంవారిపల్లె, పీటీఎం కట్టకింద ఉన్నాయన్నారు. పోతుపేట గ్రామంలోని సర్వే నంబర్ 615లో 6.15 సెంట్లు, పిడుంవారిపల్లెలోని సర్వే నంబర్ 554లో 2.30 సెంట్లు, బూర్లపల్లె గ్రామంలోని సర్వే నంబర్ 895లో 1.30 సెంట్లు, పోతుపేటలోని సర్వే నంబర్ 667లో 1.27 సెంట్లు, పీటీఎం కట్టకింద సర్వే నంబర్ 388-1లో 0.33 సెంట్లు, 388-2లో 0.25 సెంట్లు, 396లో 1.75 సెంట్లు భూములకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ 5వేలు డిపాజిట్టు చెల్లించాలన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడి డిపాజిట్ తప్ప మిగిలినవారి డిపాజిట్టు వాపసు చేస్తామన్నారు. హక్కులు దక్కించుకున్నవారు వెంటనే 1 సంవత్సరం కౌలు పూర్తిగా చెల్లించాలన్నారు. దేవస్థానమునకు బాకీ ఉన్న వారు వేలం పాటలో పాల్గొనరాదన్నారు. మిగతా షరతులను వేలం సందర్భంగా తెలియజేస్తామన్నారు

ఏవో గౌస్‌బాషాకు ఎంపీడీవోగా పదోన్నతి



గౌస్‌బాషాను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

రామసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌బాషా ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమోషన్ మీద కడప జిల్లా ఒంటి మిట్ట మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టను న్నట్లు తెలిపారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుసుమ కుమారి, ఎంపీడీవో భానుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో గౌస్‌బాషా, ప్రవీణ్‌కుమార్, రమాదేవి, శాంతి మహేంద్ర, సుమతి, బాబామస్తాన్, మున స్వామి నాయక్, సురేంద్రబాబు, రెడ్డిశేఖర్, పంచా యతీ కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది గౌస్ బాషాను సన్మానించారు.

చంద్రప్రభ వాహనంపై వెంకన్న ఊరేగింపు



వెంకటేశ్వరస్వామి ఊరేగింపులో నాయకులు

మదనపల్లె అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై వెంకన్నను ఊరేగించారు. మహిళలు, భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం పూజల్లో స్థానిక ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

రామసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో ఉన్న హజ్రత్ మాన్ పీర్ సయ్యద్ మస్తాన్ షా ఖాదరీ ఏడవ ఉరుసు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు గలేఫా సమర్పించి చక్కెర, బూందితో ఫాతెహా చేయించి అందరికీ పంచిపెట్టారు. మైసూర్ బృందం నిర్వహించిన ఖవ్వాలి భక్తులను ఆకట్టుకుంది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మన్ పీర్ సయ్యద్ బృహన్ షా ఖాదరీ (మైసూర్) మన్ పీర్ సయ్యద్‌బాబా, ఇమ్రాన్ షా ఖాదరీ, హజ్రత్ షా ఖాదరీ, తోషిఫ్ ఖాదరి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాదరిబాషా, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు వీఆర్‌ఏలకు పదోన్నతి

పెద్దతిప్పసముద్రం మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇద్దరు వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పిస్తూ మదనపల్లె మేఘస్వరూప్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీని అందుకున్నారు. రంగసముద్రం గ్రామానికి చెందిన ప్రభాకర్‌కు బి.కొత్తకోట మండల రెవెన్యూ కార్యాలయంలో వాచ్‌మన్‌గా, రంగసముద్రం గ్రామ వీఆర్ఏ మంజునాథ్‌ను పెద్దతిప్పసముద్రం మండలం రెవెన్యూ కార్యాలయంలో వాచ్‌మన్‌గా నియమించారు. తక్షణం విధుల్లోచేరాలని సబ్ కలెక్టర్ సూచించినట్లు తెలిపారు.

క్రైస్తవులకు సబ్సిడీ రుణాల పరిమితి పెంచాలి



షరీఫ్‌కు వినతి పత్రం ఇస్తున్న జాన్‌బాబు

మదనపల్లె టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వ ఇస్తున్న సబ్సిడీ రుణాల పరిమితిని పెంచాలని ఏపీ మైనారిటీ శాఖ సలహాదారు ఎండీ షరీఫ్‌ను టీడీపీ క్రిస్టియన్ మైనారిటీ నాయకుడు బోనాసి జాన్‌బాబు కోరారు. మంగళ వారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో షరీఫ్‌ను క్రైస్తవ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. క్రైస్తవుల సమాధులకు స్థలాలను కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ నెలాఖరున నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి పెద్దసంఖ్యలో క్రైస్తవులను తరలిస్తామని జాన్ బాబు షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు.

నష్ట పరిహారం అంశం.. కలెక్టర్‌కు నివేదిస్తాం : సర్వేయర్



సీటీఎం వద్ద స్థలాలను కొలుస్తున్న సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు

మదనపల్లె టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌వోబీ నిర్మాణంలో ఇంటి స్థలం కోల్పోతున్న వారికి నష పరిహారం విషయమై కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు తెలిపారు. మంగళవారం సీటీఎం గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన వున్న 9 ఇళ్ల స్థలాలను ఆయన కొలిచారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాము కొనుగోలు చేసిన ఇంటి స్థలానికి వేరొకరికి పేరిట నష్టపరిహారం ఇవ్వడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వేయర్ మాట్లాడుతూ ఇంటి స్థలం కొనుగోలు చేసిన డాక్యుమెంట్ ప్రకారం కొలతలు వేశామని, రోడ్డు పక్కన ఆరు అడుగుల పొడవుతో ఇంకా స్థలం మిగులుతోందన్నారు. ఈ విషయమై బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా కలెక్టర్ ఆర్బిట్రేషన్ కోర్టులో తేల్చారని, ఇప్పుడు వున్న వివాదం కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్ సాయితేజ, ఎన్‌హెచ్ ఏఈ, బాధితులుపాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక పంచాయతీలో సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం కురవంక ప్రాథమిక పాఠశాల వద్ద స్వాస్థ్య ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరంలో 376 మంది వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చలపతి మాట్లాడుతూ ఈ శిబిరంలో స్త్రీల వ్యాధులు, కిడ్నీ, మధుమేహం, రక్తపోటు, రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారన్నారు. ఇందులో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పి.శశికుమార్, మోహన్‌రెడ్డి, రైల్వే రమణ, టీవైఎస్ పునీత్, హరి, డాక్టర్లు కృష్ణతేజ, శిల్ప, స్వాస్థ్య ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ములకలచెరువు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఏవో లీలాకుమారి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం రైతులకు, వీఓ లీడర్లకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో అధునిక పద్ధతులను పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఏపీఎం మధు మాట్లాడుతూ వెలుగు సంఘాల్లోని మహిళా రైతులు సాగులో మెళకువలు పాటించి లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ రఘునాథ్, మోడల్ మేకర్ సుబ్బారామ్, సిబ్బంది రాజేశ్వరి, ఉమాదేవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన సంకల్ప సభలు జయప్రదం చేయండి

ములకలచెరువు, మే 6(ఆంధ్రజ్యోతి): బహుజన సంకల్ప సభలు విజయవంతం చేయాలని నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు పెద్దపాళ్యం మల్లికార్జున పిలుపు నిచ్చారు. ములకలచెరువులో మంగళవారం సంకల్ప సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం అంతిమ లక్ష్యమే ధ్యేయంగా హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లప్ప, నాయకులు అంజి, కృష్ణప్ప, మంత్రాల రమణ, మల్లికార్జున, నారాయణ, సిద్దప్ప, బాషా, భాస్కర్, వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నార

సంక్షేమ ఫలాలు అర్హులకు అందాలి

పీలేరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించాలని పీలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ డాక్టర్ ఎస్. హబీబ్ బాషా, ఈవో గురుమోహన్ సూచించారు. మంగళవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని 5వ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉండాలని సూచించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఇస్తున్న పథకాలు అర్హులైన పేదలకు అందించడంలో సచివాలయ సిబ్బంది పనితీరు కీలకమని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల వ్యక్తిగత సమాచారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్, లింక్‌లకు స్పందించకూడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వార్డుల సభ్యులు, సచివవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల స్థల పరిశీలన




గురుకుల పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరిమడుగు మార్గంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మదనపల్లె డివిజన్ పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులనుప్రారంభించనునట్లు వివరించారు. కా ర్యక్రమంలో డీఈ మధుసూదన్, ఎంపీడీవో వెంక టేశులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తూట్‌లో మోసంపై కేసు నమోదు

బి.కొత్తకోట, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో వున్న ముత్తూట్ ఫైనాన్స్‌లో జరిగిన మోసంపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్ బాబు మంగళవారం తెలిపారు. కస్టమర్లు చెల్లించిన మొత్తాలను వారి ఖాతాలకు జమ చేయకుండా పక్కదారి పట్టించినట్లు బాధితులు ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట ఆందోళన చేశారు. అప్పట్లో అలాంటిదేమీ లేదని బుకాయించిన యాజమాన్యం ఇపుడు పోలీసులను ఆశ్రయించింది. ఈ సంస్థ స్థానిక కార్యాలయ సిబ్బంది దూదేకుల ఇమ్రాన్‌బాషా, జరిపిటి హరీష్, యం.హరికృష్ణ కలిసి బంగారు ఆభరణాల లోన్‌లకు సంబంధించి ఖాతాదారుల నుంచి తీసుకున్న రూ.65.76 లక్షలను తమ సొంత అవసరాలకు వాడుకుని మోసం చేసినట్లు ముత్తూట్ ఫైనాన్స్ రీజినల్ మేనేజర్ యస్.దేవరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఎస్పీని కలిసి రక్షణ కోరిన ప్రేమజంట



పోలీసు స్టేషన్‌లో ప్రేమజంట

మదనపల్లె అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమజంట మంగళవారం స్థానిక డీ ఎస్పీ మహేంద్రను కోరింది. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, రేణుమాకులపల్లె పంచాయతీ, దండువారిపల్లెకు చెందిన వెంకటరమణ, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు సుదర్శన్(30) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇం జనీర్‌గా పని చేస్తున్నాడు. చిత్తూరు జిల్లా సోమల మండలం, గురికానివారి పల్లెకు చెందిన మహేశ్వర, పుష్పావతిల కుమార్తె కె. చైత్ర (19)తో వివాహం చేసేందుకు గత డిసెంబర్‌లో రెండు కుటుంబాల సభ్యులు నిర్ణయించారు. కొద్దిరోజుల తరువాత చైత్ర మేన మామ అడ్డు చెప్పడంతో ఈ వివాహం నిలిచి పోయింది. అప్పటికే ప్రేమించుకున్న సుదర్శన్ , చైత్ర మూడు రోజుల క్రితం ఇంట్లోంచి పారిపోయి పుంగనూరు సమీపంలోని శివాలయంలో వివాహంచేసుకున్నారు. తల్లిదండ్రుల నుంచి, చైత్ర మేనమామ నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు

సంబేపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో సోమవారం రాత్రి గ్రామస్తులు వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచిన పల్లకీని ట్రాక్టర్‌పై అమర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయ, కర్పూరం సమర్పించుకున్నారు. బుధవారం స్వామి వారి ఆరాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు.